ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
సోమవారం 2 జూన్ 2025

ఆగిన ఇసుక తవ్వకాలు

- మాన్‌సూన్ సీజన్ ప్రారంభంతో ఫుల్‌స్టాప్
- ఓపెన్ రీచ్‌లు క్లోజ్.. డీసిల్టింగ్ పాయింట్లకే అవకాశం
- ఇకపై యార్డుల్లోనే విక్రయాలు
- తొమ్మిదిచోట్ల 2.34 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక

నెల్లూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : పెన్నానదిలో ఇసుక తవ్వకాలకు బ్రేకులు పడ్డాయి. మాన్‌సూన్ సీజన్ ప్రారంభం కావడంతో తవ్వకాలు నిలిచాయి. జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్(ఎన్‌జీటీ) నిబంధనల ప్రకారం జూన్ నుంచి సెప్టెంబరు వరకు నదుల్లో తవ్వకాలు జరపకూడదు. దీంతో పెన్నాలో ఇసుక తవ్వకాలు జరుపుతున్న రీచ్‌లలో ఆపరేషన్లు నిలిపేయాల్సి వచ్చింది. అప్పటి వరకు యార్డుల్లోని ఇసుకను మాత్రమే వినియోగించుకోవాల్సి ఉంటుంది. అయితే ఈ నిబంధనల కింద డీసిల్టేషన్ పాయింట్లకు మినహాయింపు ఉంది.

● 9 ప్రాంతాల్లో తవ్వకాలు

ప్రస్తుతం జిల్లాలో తొమ్మిది ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. అందులో సంగం, సూరాయపాలెం-1, సూరాయపాలెం-2, పోతిరెడ్డిపాలెం పాయింట్ల వద్ద సంగం, పెన్నా బ్యారేజీల ఎగువన బోట్ల ద్వారా ఇసుకను వెలికితీస్తున్నారు. అలానే పల్లిపాడు, మినగల్లు, విరువూరు, అప్పారావుపాలెం, పడమటికంభం పాడు ప్రాంతాల్లో సెమీ మెకనైజ్డ్ ఓపెన్ రీచ్‌లు నడుస్తున్నాయి. ఇప్పటి వరకు ఈ రీచ్‌ల్లో నేరుగా నదిలో ఇసుక తవ్వకాలు జరిపేవారు. వాహనాలు కూడా నదిలోకి వెళ్లే ఇసుకను లోడ్ చేసుకొని వచ్చేవి. వీటితోపాటు ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టడంతో నది పరివాహకంలో అనేక ప్రాంతాల్లో చిన్న చిన్న రీచ్‌లు ఏర్పడ్డాయి. ట్రాక్టర్లు, ఎండ్ల బండ్ల ద్వారా ఇక్కడి నుంచి ఇసుకను తవ్వుకెళుతున్నారు. కోడూరుపాడు, ముదివర్తి, భగత్‌సింగ్‌కాలనీ, పొట్టేపాలెం, తెలుగురాయపురం వంటి ప్రాంతాల్లో ఎక్కువగా ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తీసుకెళుతున్నారు. ఇలా నదిలో ఓపెన్‌రీచ్‌ల ద్వారానూ, చిన్న చిన్న రీచ్‌ల ద్వారానూ నేరుగా ఇసుక తవ్వకాలు జరుపుతున్న పాయింట్లలన్నింటినీ మూసి వేయాల్సి ఉంది. ప్రత్యామ్నాయంగా యార్డుల్లో నిల్వ చేసిన ఇసుకనే అవసరాలకు వినియోగించుకోవాల్సి ఉంటుంది.



సంగం స్టాక్ యార్డులో నిల్వ ఉన్న ఇసుక

అత్యధికంగా సంగంలో నిల్వలు

జిల్లాలో ఉన్న తొమ్మిది స్టాక్‌యార్డుల్లో సుమారు 2.34 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక నిల్వలు ఉన్నట్లు అధికార వర్గాలు చెబుతు న్నాయి. అత్యధికంగా సంగం యార్డులో 99 వేలు క్యూబిక్‌మీటర్లు ఇసుక నిల్వ ఉంది. పోతిరెడ్డిపాలెంలో 40 వేలు, సూరాయపాలెం-1లో 41 వేలు, సూరాయపాలెం-2లో 15 వేలు, అప్పారావుపాలెంలో 20 వేలు, పీకేపాడులో 5 వేలు, పల్లిపాడులో 5600, మినగల్లులో 3 వేలు, విరువూరులో 5 వేల క్యూబిక్ మీటర్ల ఇసుక నిల్వలు ఉన్నాయి. రానున్న నాలుగు నెలలపాటు ఈ యార్డుల నుంచే విక్రయాలు జరుగుతాయి. ప్రస్తుతం జిల్లాలో సరాసరి రోజుకు 4 వేల క్యూబిక్ మీటర్ల వరకూ ఇసుక వినియోగం ఉంటోంది. ఆ లెక్కన చూస్తే జిల్లాలో ఉన్న ఇసుక నిల్వలు రెండు నెలలకు సరిపోతాయి. వాస్తవానికి ముందు నుంచి జిల్లా అధికారులు ఇసుక నిల్వలను పెంచాలని కాంట్రాక్టర్లను ఆదేశిస్తున్నా వారు పట్టించుకోలేదు. ఒక్క సంగం మినహా మిగతా ఎక్కడా కూడా అధికారుల లక్ష్యం మేరకు నిల్వలు ఉంచలేకపోయారు. ఇక వర్షాకాలం రానున్న నేపథ్యంలో అక్టోబరులో కూడా తవ్వకాలు చేయడం అంత సులభం కాదు. ఈ లోపే డీసిల్టేషన్ పాయింట్ల ద్వారా వీలైనంత ఎక్కువ ఇసుకను నిల్వ చేసుకోవాల్సి ఉంది. కాగా మాన్‌సూన్ సీజన్ ప్రారంభమైనా నదిలో ఇసుక తవ్వకాలు నిలిపివే యాలన్న దానిపై అధికారులు ఎలాంటి ప్రకటన చేయకపోవడం గమనార్హం.

సోమశిలలో 42.206 టీఎంసీల నీరు నిల్వ

అనంతసాగరం జూన్ 1 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం నీటినిల్వ సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, ఆదివారం నాటికి 42.206 టీఎంసీలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇన్‌ఫ్లో 399 క్యూసెక్కులు వస్తుండగా పెన్నాడెల్టాకు 3,150, ఉత్తర కాలువకు 300, దక్షిణ కాలువకు 50 క్యూసెక్కుల సరఫరా చేస్తున్నారు.

పట్టాలపై మృత్యు ఘోష

- రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తుల ఆత్మహత్య
- రైలు ఎక్కుతూ.. ప్లాట్‌ఫారమ్‌పై జరిగే ప్రమాదాల్లో మరికొందరు..
- మిస్టరీగానే బలవన్మరణాలు
- మూడేళ్లలో ప్రాణాలు తీసుకుంది 173 మంది

నెల్లూరు(క్రైం), జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వారు ఎక్కడ పుట్టారో తెలియదు...ఎందుకు ఆత్మహత్యకు పాల్పడుతున్నారో అంతుపట్టదు... ఇలా ఏడాదిలో ఎంతోమంది రైలు కిందపడి బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. అలాగే పట్టాలు దాటుతూనో.. ఆయాస్టేషన్లలో రైలు ఎక్కుతూనో... ప్రమాదాలు జరిగి మృతి చెందుతున్నవారి సంఖ్య కూడా ఇటీవల పెరిగింది. ఇలా మరణించినవారి మృతదేహాలకు ఆయా మున్సిపాలిటీల సిబ్బంది అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో గత మూడేళ్లలో ఇలా మృతి చెందినవారు అక్షరాల 173 మంది. ఒక్క జిల్లాపరిధిలోనే ఇంత మంది ఉంటే ఇక రాష్ట్రంలో, దేశంలో ఇంకెంతమంది ఉంటారో ఊహించుకోవచ్చు.

● మృతదేహం గుర్తించాక..

ఇలా చనిపోయిన వారి సమాచారం అందుకున్న వెంటనే జీఆర్‌పీఎస్ పోలీ సులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలిస్తారు. ఆధారాలు తెలుసుకునేందుకు ఆరా తీస్తారు. చుట్టుప్రక్కల ప్రాం తాల్లో అనవాళ్ల కోసం గాలిస్తారు. ఎలాంటి ఆధారాలు దొరక్క పోతే స్థానికుడిగానే పరిగణించి, ఆ ప్రాంతం లోని వీఆర్‌వో లేదా పంచాయతీ కార్యదర్శికి సమా చారం అందిస్తారు. అప్పటికి వివరాలు తెలియకపోతే దేశంలో ఏ ప్రాంతానికి చెందినవారో పరిశీలించి ఓ అవగాహనకు వస్తారు. మృతదేహంపై ఉన్న పుట్టుమ చ్చలు, దుస్తులు, ఇతర గుర్తులను ఫొటోలు తీసి లుక్ అవుట్ నోటీసును స్టేట్, సెంట్రల్ పోర్టల్‌లో పొందు పరుస్తారు. పత్రికలు, సోషల్ మీడియాలో గుర్తుతెలి యని మృతదేహం అంటూ ప్రకటనలు ఇస్తారు.

● మిస్టరీగా మరణాలు

రైలు పట్టాలపై జరిగే ప్రమాదాల్లో మృతి చెందుతున్న వారు, ఆత్మహత్యలు చేసుకునే వారి కేసులు మిస్టరీగానే మిగులుతున్నాయి. జిల్లాలో మూడేళ్ల కేసులను పరిశీలిస్తే... 2023లో 168 మంది మరణించారు. వారిలో 122 మందిని గుర్తించగా, 46 మందిని గుర్తిం చలేదు. 81 మంది ఆత్మహ త్యలు చేసుకోగా, వారిలో 64 మందిని గుర్తించినగా 17 మంది ఇప్పటికి ఎవరో తెలి యదు. రైలు పట్టాల పక్కన, ప్లాట్‌ఫారంలపై అనారోగ్యంతో మృతి చెందిన వారు 11 మంది కాగా, వారిలో ఐదుగురిని ఇప్పటికీ గుర్తించలేదు. 2024లో 171 మంది మరణించారు. వారిలో 127 మందిని గుర్తించగా, 44 మందిని గుర్తించలేదు. 66 మంది ఆత్మహత్యలు చేసుకోగా, వారిలో 51 మందిని గుర్తించిగా 15 మంది ఇప్పటికి ఎవరో తెలియదు. రైలు పట్టాల పక్కన, ప్లాట్ ఫారంలపై, అనారోగ్యంతో మృతి చెందిన వారు 13 మంది కాగా, వారిలో ఐదుగురిని గుర్తించలేదు. 2025లో మే 16 వరకు తీసుకుంటే రైలు పట్టాలపై జరిగిన ప్రమాదాల్లో 63 మంది మరణించారు. వారిలో 36 మందిని గుర్తించగా, 27 మందిని గుర్తించలేదు. 29 మంది ఆత్మహత్య చేసుకోగా, వారిలో 21 మందిని గుర్తించినగా 8 మంది ఇప్పటికి ఎవరో తెలియదు. రైలు పట్టాల పక్కన, ప్లాట్‌ఫారంలపై అనారోగ్యంతో మృతి చెందిన వారు 10 మంది కాగా వారిలో నలుగురిని గుర్తించగా ఆరుగురికి ఇంకా గుర్తించలేదు.



నెల్లూరు సౌత్ స్టేషన్ సమీపంలో రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసు

మూడు రోజుల తర్వాత పంచనామా

వివరాలు తెలియకపోతే మూడు రోజుల తర్వాత శవపంచనామా నిర్వహిస్తారు. అనంతరం ప్రభుత్వ వైద్యులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహిస్తారు. తదుపరి ఆయా మున్సిపాలిటీ అధికారుల అనుమతు లతో మృతదేహాన్ని మున్సిపల్ సిబ్బందికి అప్పగిస్తారు. మృతుడు ఏమతానికి చెందినవారో గుర్తించి వారి మతాచారాల ప్రకారం అంత్యక్రియలు చేస్తారు.

ఇంటర్ విద్యలో మార్పులు



- నేటి నుంచి జూ. కళాశాలల పునఃప్రారంభం
- జేఈఈ, నీట్, ఏపీ ఈఏపీ సెట్‌కు ప్రత్యేక శిక్షణ
- ప్రశ్నపత్రం నమూనా విడుదల

నెల్లూరు(విద్య), జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యలో ఈ ఏడాది నుంచి కొత్త విధానాన్ని ప్రభుత్వం అమలు చేయనున్నాది. నీట్, జేఈఈ, ఈఏపీ సెట్‌కు విద్యార్థులను సన్నద్ధం చేసేలా సిలబస్‌లో మార్పులు చేసింది. ఈ మేరకు సిలబస్, ప్రశ్నపత్రాల కూర్పు, అకడమిక్ క్యాలెండర్‌ను ఇంటర్‌బోర్డు విడుదల చేసింది. తొలివిడతగా ఏప్రిల్ 1 నుంచి 24 వరకు తరగతులు నిర్వహించి, 25 నుంచి జూన్ ఒకటి వరకు సెలవులు ఇచ్చారు. తిరిగి జూన్ 2 (సోమవారం) నుంచి తరగతులను ప్రారంభిస్తున్నారు. అకడమిక్ క్యాలెండర్‌లో 314 రోజులకు గాను 235 పనిదినాలు, 79 సెలవు దినాలను ప్రకటిస్తూ షెడ్యూల్ విడుదల చేశారు.

● పాఠ్య పుస్తకాల పంపిణీ

ఇంటర్ ద్వితీయ సంవత్సరానికి జిల్లాకు 1,19,724 నోట్‌పుస్తకాలు, 11,600 పాఠ్యపుస్తకాలు చేరాయి. వీటిని జిల్లాలోని అన్ని కళాశాలలకు పంపిణీ చేశారు. అలాగే ప్రథమ సంవత్సరంలో చేరేందుకు కూడా గత నెల నుంచే ప్రవేశాలు ప్రారంభించారు. ప్రభుత్వ కళాశాలలన్నింటిలోనూ మధ్యాహ్నం భోజనం అమలు చేయనున్నారు.

● సిలబస్ మార్పు

ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రథమ సంవత్సరం సబ్జెక్ట్‌ల్లో కొత్త సిలబస్‌ను రూపొందించారు. ప్రథమ, ద్వితీయ భాషలతోపాటు ప్రస్తుతం ఉన్న 4 సబ్జెక్టులు సైన్స్, 5 సబ్జెక్టల ఆర్ట్స్ విభాగాల వ్యవస్థను ప్రక్షాళన చేసి నూతనంగా ఎంబైపీసీని ప్రవేశపెట్టారు. అలాగే ప్రథమభాషగా ఇంగ్లిష్‌ను అందరికీ వర్తింప చేశారు. ద్వితీయభాష కోసం ప్రస్తుతం ఉన్న పది భాషల స్థానంలో అదనంగా సైన్స్ ఆర్ట్స్ గ్రూపుల్లో మరో 14 సబ్జెక్టలను ప్రతిపాదించారు. గ్రూపు సబ్జెక్టల విభాగానికి వస్తే ఎంపీసీ గ్రూపు విద్యార్థులు అదనంగా బయాలజీని, బైపీసీ వారు అదనంగా మ్యాథ్స్‌ను ఎంపిక చేసుకునే అవకాశం కల్పించారు.

● ప్రశ్నపత్రాల్లో మార్పులు.

ఈ ఏడాది నుంచి ప్రశ్నపత్రాల కూర్పులో మార్పులు చేశారు. మ్యాథ్స్-ఏ, బీలుగా ఉన్న రెండు పేపర్లను కలిపి ఒకే పేపర్‌గా, బోటనీ, జువాలజీలను కలిపి బయాలజీ పేపర్‌గా మార్పు చేస్తున్నారు. వీటితోపాటు ఆయా సబ్జెక్టలలోని మార్కులను పునర్విభజన చేశారు. ప్రస్తుతం అమల్లో ఉన్న 2, 4, 8 మార్కుల విధానాన్ని కొనసాగిస్తూనే ప్రతి సబ్జెక్టులో దాదాపు 10శాతం ఒక్క మార్కుల ప్రశ్నలు ఉండేలా ప్రశ్నపత్రాన్ని రూపొందించను న్నారు. గతంలో ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉన్న 7 పీరియడ్ల విధానా నికి స్వస్తి పలికారు. అన్ని జూనియర్ కళాశాలలు కూడా ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, ఒక్కో పీరియడ్ 50 నిమిషాల చొప్పున 8 పీరియడ్లు ఉండేలా మార్పులు చేశారు.

● షెడ్యూల్ ఇలా...

ఈ ఏడాది జూన్ 2న కళాశాలలు ప్రారంభించి జూలై 17 నుంచి 19 వరకు యూనిట్-1 పరీక్షలు నిర్వహిస్తారు. ఆగస్టు 18 నుంచి 20 వరకు యూనిట్-2 పరీక్షలు, సెప్టెంబరు 15 నుంచి 20 వరకు క్వార్టర్లీ పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే సెప్టెంబరు 28 నుంచి అక్టోబరు 5వరకు దసరా సెలవులు, అక్టోబరు 22 నుంచి 24 వరకు యూనిట్-3 పరీక్షలు, నవంబరు 17 నుంచి 22 వరకు అర్ధ సంవత్సరం పరీక్షలు, జనవరి 15 నుంచి 20వరకు ప్రీఫైనల్-1 పరీక్షలుంటాయి. జనవరి 10 నుంచి 18 వరకు సంక్రాంతి సెలవులు, జనవరి 21 నుంచి 28వరకు ప్రీఫైనల్-2, ఫిబ్రవరిలో ప్రాక్టికల్స్, ఫిబ్రవరి చివరి నుంచి మార్చిలో థియరీ పరీక్షలు నిర్వహిస్తారు. మార్చి 18న అకడమిక్ సంవత్సరాన్ని ముగించనున్నారు.

నూతన పద్ధతుల్లో ఇంటర్



ఇంటర్‌లో అభ్యసనా సామర్థ్యాలను పెంచడంతో పాటు జాతీయస్థాయి ప్రమాణాలతో ఇంటర్ విద్యను బలోపేతం చేసేందుకే సంస్కరణలు రూపొందించారు. కోరుకున్న సబ్జెక్టలను ఎంపిక చేసుకోవడం, అనవసర విషయాలను తగ్గించుకోవడం, విద్యార్థులను ఉన్నతవిద్య, పోటీ పరీక్షలకు సన్నద్ధం చేయడమే లక్ష్యంగా ఇంటర్ తరగతులు ప్రారంభం కానున్నాయి.

- టీ.వరప్రసాదరావు, ఇంటర్‌బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి

క్షీణిస్తున్న ధరలు

- రోజురోజుకి పడిపోతున్న పొగాకు సరాసరి రేట్లు
- మీడియం గ్రేడ్లలోనూ కోత
- మే ముగిసినా 25 శాతం కూడా సాగని అమ్మకాలు
- రంగుమారుతున్న ఆకుతో రైతుల ఆందోళన

కందుకూరు, జూన్1(ఆంధ్రజ్యోతి): పొగాకు ధరలు రోజు రోజుకు దిగజారుతున్నాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మరోపక్క నోబిడ్‌లు, సీఆర్(కంపెనీ రిటర్న్)లు పెద్దసంఖ్యలో ఉంటూ వేలంలోనూ విపరీతమైన జాప్యం జరుగుతోంది. ఒంగోలు రీజియన్ పరిధిలో అంచనా ఉత్పత్తిలో 25 శాతం అమ్మకాలు కూడా నేటికీ పూర్తికాలేదు. ఇదేరీతిలో వేలం జరిగితే అమ్మకాలు పూర్తవ్వాలంటే మరో ఏడునెలలు పడుతుందని బోర్డు అధికారులు పేర్కొన్నారు. ఇళ్లలో, గోదాముల్లో నిల్వచేసుకున్న పొగాకు రంగుమారిపోవటం ప్రారంభమైనందున తీవ్రంగా నష్టపోక తప్పదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

● తగ్గిన సరాసరి ధర

గత ఏడాది వేలం పూర్తయ్యే సమయానికి దాదాపు అన్ని కేంద్రాలలోను సరాసరి ధర క్వింటాల్‌కు రూ. 27వేలుగా ఉంది. ఈ ఏడాది ఇప్పటివరకు లోగ్రేడ్‌ల అమ్మకాలు ప్రారంభం కాకపోయినా, సరాసరి ధర క్వింటాల్‌కు రూ. 2వేలు నుంచి రూ. 3వేలు వరకు తగ్గిపోయింది. కందుకూరు 2 వేలం కేంద్రంలో శనివారం సరాసరి ధర రూ. 25,611 లభించగా, కందు కూరు 1లో క్వింటాల్‌కు 24,587 ధర దక్కింది. అలాగే కలిగిరిలో సరా సరి ధర రూ. 25,151 లభించగా డీసీ పల్లిలో రూ. 23,288 మాత్రమే దక్కింది.



పొగాకు వేలాన్ని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

వేలంలో జాప్యం



ఈ ఏడాది 450 క్వింటాళ్ల పొగాకు పండించగా ఇప్పటివరకు 100 క్వింటాళ్ల మాత్రమే అమ్ముకోగలిగా. వేలంలో జాప్యం వల్ల ఆకు నాణ్యత కోల్పోయే ప్రమాదం ఉంది. వేలంను వేగవంతం చేయటంతోపాటు ధరలు దిగజారకుండా చర్యలు తీసుకోవాలి. లోగ్రేడ్‌ను పొగాకు సమాఖ్య ద్వారా కొనుగోలు చేయిస్తే మిగిలిన గ్రేడ్‌ల కోసం వ్యాపారులు పోటీపడి ధరలు తగ్గకుండా నిలిచే అవకాశం ఉంది.

- తోకల సుబ్బారావు, రైతు, పెదమోపాడు

ఎక్కడివారు అక్కడే !

● సాంఘిక సంక్షేమశాఖలో బదిలీల ఫైల్ వెనక్కు...



నెల్లూరు(హరనాథపురం), జూన్ 1(ఆంధ్రజ్యోతి) : జిల్లా సాంఘిక సంక్షేమశాఖలో గుట్టుచప్పుడు కాకుండా బదిలీలు నిర్వహించటంతో పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. ఖాళీలను బహిరంగ పరిచి, ఐదేళ్ల పూర్తి చేసుకున్న వారికి బదిలీలు నిర్వహించాల్సి ఉండగా, అలా జరగలేదనే విమర్శలు వెల్లువెత్తుతుతున్నాయి. ఉద్యోగ సంఘాల నేతలుగా చలామణి అవుతున్న కొందరు హాస్టల్ వార్డెన్ల ఇష్టానుసారంగా ఈ బదిలీలను పూర్తి చేసి ఉన్నతాధికారుల ఆమోదానికి పంపినట్లు తెలిసింది. ఈ ఫైల్‌ను డీఆర్వో పరిశీలించి సమగ్ర సమాచారంతో పంపాలని వెనక్కి పంపినట్లు సమాచారం. యూనియన్ నాయకులుగా కొనసాగుతున్న కొందరు 11 నుంచి 14 ఏళ్లుగా ఒకే స్థానంలో పనిచేస్తున్నారు. వారిని కచ్చితంగా బదిలీ చేయాల్సి ఉంది. కాని బదిలీ చేయకుండా అక్కడే కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాగా ఉద్యోగుల బదిలీలకు ఇంకా గడువు ఉంది.అయితే ఇక ఆ శాఖలో ఏం జరగబోతుందో వేచి చూడాలి.

డ్రిప్, స్ప్రింక్లర్ల సరఫరా పేరుతో

కుచ్చుటోపీ

- రైతులను మోసం చేసిన మైక్రో ఇరిగేషన్ కంపెనీ ఉద్యోగి
- అతనితో మాకు సంబంధం లేదంటున్న యాజమాన్యం
- ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారుల ప్రోద్బలంతో నగదు బదిలీ
- కేసుల నమోదుకు అన్నదాతల సన్నద్ధం





ఉలవపాడు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ, ఉద్యాన రైతులను మైక్రో ఇరిగేషన్ పరికరాలయిన డ్రిప్, స్ప్రింక్లర్ల సరఫరా చేస్తామని నమ్మపలికిన ఓ వ్యక్తి రైతుల నుంచి సుమారు రూ. 20 లక్షలు వసూలు చేసుకుని పరారయ్యాడు. నెలలు గడుస్తున్నా ఆ వ్యక్తి నుంచి సమాధానం లేకపోవడంతో రైతులు తాము మోసపోయామని గ్రహించి, అతనిపై కేసు నమోదుకు సన్నద్ధమవుతున్నారు. వివరాల్లోకి వెళితే...

ప్రకాశం జిల్లా పీసీపల్లి మండలం, తలకొండపాడుకి చెందిన కూరపాటి నారాయణ నెల్లూరులోని మహేంద్ర డ్రిప్స్ ఇరిగేషన్, సప్లయ్ కంపెనీలో ఉద్యోగినని చెప్పి, నాలుగు నెలల క్రితం స్థానిక విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ల (వీఏవోల)ను కలిశాడు. రాష్ట్ర మైక్రో ఇరిగేషన్ అధికారుల నుంచి గుర్తింపు పొందిన కంపెనీ మహేంద్ర మైక్రో ఇరిగేషన్ అని చెప్పి ఐడీ కార్డు, పే స్లిప్ చూపించి వారిని నమ్మపలికాడు. అంతేకాకుండా వలేటివారిపాలెం, లింగసముద్రం, పొన్నలూరు మండలాల రైతులకు డ్రిప్స్ స్ప్రింక్లర్స్ సరఫరా చేశానని, అక్కడి వీఏవోలతో మాట్లాడించాడు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఇరిగేషన్ పరికరాలపై 50 శాతం రాయితీని అందిస్తున్నదని, మండలంలోని ఉలవపాడు, ఆత్మకూరు, భీమవరం, రాజుపాలెం, చాగొల్లు గ్రామాలకు చెందిన రైతులు 22 మంది నుంచి స్ప్రింక్లర్ల కోసం వీఏవోల లాగిన్‌లో స్ప్రింక్లర్ల పైపులు, డ్రిప్ పరికరాలను నమోదు చేయించుకున్నాడు. ఒక్కొక్క పైపు 20 అడుగుల చొప్పున ఒక సెట్‌లో 31 స్ప్రింక్లర్లు పైపులు ఉంటాయి వాటి ఖరీదు రూ. 13,000, కాగా 20 అడుగుల చొప్పున ఒక సెట్‌లో 40 స్ప్రింక్లర్స్ నల్ల పైపులు ఉంటాయి. వాటి ఖరీదు రూ.18,000 ఉంటుంది. ఈ లెక్కన 22 మంది రైతుల్లో కొందరు రెండు, మూడు సెట్ల పైపులకు నగదు చెల్లించారు.

● నమ్మకం కోసం డ్రిప్ అందజేత

బిందు సేద్యం కోసం తొలుత ఐదారుగురు మామిడి రైతులు రూ.1,50,000 చెల్లించడంతో డ్రిప్ పరికరాలను సకాలంలో అందచేశాడు. నగదు కూడా మైక్రో ఇరిగేషన్ పీడీ ఖాతా నుంచి గుర్తింపు పొందిన ఆయా కంపెనీలకు చెల్లింపులు జరగాల్సి ఉంది. అయితే నారాయణ డైరెక్టుగా రైతుల నుంచి తన ఖాతాకు నగదు చెల్లింపులు చేయించుకుని డ్రిప్ పరికరాలను రైతులకు అందించాడు. దీంతో నమ్మకం కుదిరిన మండలంలోని మరికొందరు రైతులు ఆన్‌లైన్ తమ పేర్లు నమోదు చేయించుకున్నా, నగదు మాత్రం నారాయణ ఖాతాకు పంపారు. మార్చి నెల వరకు అదిగో.. ఇదిగో... వస్తున్నాయి అంటూ దాటవేస్తూ వచ్చాడు. ఏప్రిల్ నుంచి ఫోన్ స్విచ్చాఫ్ చేశాడు. దీంతో తాము మోసపోయామని రైతులు గ్రహించి లబోదిబోమంటున్నారు.

మాకు ఎలాంటి సంబంధం లేదు

ఉలవపాడు మండలం ఆత్మకూరుకి చెందిన రైతులు ఈ విషయమై తమను సంప్రదించారని మండల ఉద్యానశాఖ అధికారి వీ. జ్యోతి తెలిపారు. తాను రాష్ట్ర మైక్రో ఇరిగేషన్ అధికారులను సంప్రదిస్తే నారాయణ అనే పేరు తమ వెబ్‌సైట్‌లో నమోదు కాలేదని వారు పేర్కొన్నారని ఆమె వివరించారు. రైతులు మోసపోయిన విషయంలో తమ శాఖకు ఎలాంటి సంబంధం లేదని ఆమె పేర్కొన్నారు.

● కంపెనీతో ఆయనకు సంబంధం లేదు..

రైతులను మోసగించిన కూరపాటి నారాయణకు, తమ కంపెనీకి ఎలాంటి సంబంధం లేదని, అతను ఓ డీలర్ మాత్రమేనని నెల్లూరులోని మహేంద్ర డ్రిప్స్ ఇరిగేషన్స్ సప్లయ్ కంపెనీ ప్రతిని ధులు పేర్కొన్నారు. అయితే ఆ కంపెనీ మాట మారుస్తున్నదని రైతులు, రైతుసేవా కేంద్రం ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. అయితే కంపెనీ తరుపున మైక్రో ఇరిగేషన్ ఇంజనీర్ శ్రీహరి తమ పొలాలకు వచ్చి ఎస్టిమేషన్ వేశారని, ఇప్పుడు నారాయణతో సంబంధాలు లేవంటే ఎలాగని రైతులు నిలదీ స్తున్నారు.

● పక్క మండలాల్లోనూ ఇదే మోసం

ఉలవపాడు మండలంతోపాటు లింగసముద్రం, కందుకూరు, వలేటివారిపాలెం మండలాల్లో కూడా రైతులకు ఇదే తరహాలో నారాయణ మోసం చేశాడని సమాచారం. మొత్తం మీద నాలుగు మండలాల్లో సుమారు రూ. 20 లక్షలు సొమ్ముతో పరారైనట్లు రైతులు చెబుతున్నారు. మోసపోయిన రైతులు ఆదివారం పోలీసులను ఆశ్రయించగా, విచారించి కేసు నమోదు చేస్తామని వారు పేర్కొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	127
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	254

కోడిగుడ్ల ధర (100): 525

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.9260
వెండి కిలో ధర	రూ.100,600
వెండి ఒక గ్రాము	రూ.103.60

సీపీఐ బలోపేతానికి కృషి : రాష్ట్ర నాయకుడు ఈశ్వరయ్య

నెల్లూరు (వైద్యం), జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ బలోపేతానికి కృషి చేస్తానని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జీ ఈశ్వరయ్య వెల్లడించారు. ఆదివారం సీపీఐ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య పర్యవేక్షణలో డాక్టర్ మారం సుధాకర్, లీలామోహన్, దుడ్డు రమేష్‌బాబు, మునిశ్చంద్ర, రఫీద్, లక్ష్యయ్య తదితరులు పార్టీలో చేరారు. ఈశ్వరయ్య మాట్లాడుతూ మోదీ పాలనలో దేశం ఎదుర్కొంటున్న దుర్భర పరిస్థితులపై ప్రజలను చైతన్య పరచాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామరాజు, మస్తాన్ షరీఫ్, షేక్ మున్నా తదితరులు పాల్గొన్నారు.



కమనీయం శ్రీవారి కల్యాణం

నెల్లూరు(సాంస్కృతికం), జూన్ 1(ఆంధ్రజ్యోతి) : నగరంలోని సాయి దర్బార్ వార్షికోత్సవంలో భాగంగా మందిరానికి చెందిన శ్రీసాయి నిత్య అన్నప్రసాద నిలయంలో ఆదివారం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. వేదగిరి ఫణిశర్మ బృందం కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముత్యాల తలంబ్రాలు, అన్నమయ్య సంకీర్తనలు, పండరి భజన, కోలాట కార్యక్రమాలతో ఈ వేడుక భక్తులకు కనువిందు చేసింది. ఉభయకర్తలుగా కృష్ణగిరి దేష్వాల్ సింగ్, దేవకీదేవి వ్యవహరించారు. సాయి దర్బార్ చైర్మన్ మధుసాయి, గౌరవల హాదారు రామసుబ్బారావు పర్యవేక్షించారు.

పాలు సంపూర్ణ ఆహారం

నెల్లూరు(సాంస్కృతికం), జూన్ 1(ఆంధ్రజ్యోతి): పాలు, పాల ఉత్పత్తులు సంపూర్ణ ఆహారమని, వాటిని అందరూ వినియోగించుకోవాలని ప్రజా సైన్స్ వేదిక నగర అధ్యక్షుడు ఎం సతీష్‌కుమార్ తెలిపారు. నగరంలోని జిల్లా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన తరగతుల్లో ఆదివారం క్షీర విప్లవం గురించి ఆయన విద్యార్థులకు వివరించారు. అనంతరం పుస్తక పఠనంలో మెలకువలు నేర్పారు. గ్రంథాలయాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్ రాజా, డిప్యూటీ లైబ్రేరియన్ ప్రసాద్ పాల్గొన్నారు.

పునీత ఆంథోని చర్చి పునఃప్రారంభం

నెల్లూరు(సాంస్కృతికం), జూన్ 1(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఫత్తేఖాన్ పేటలో ఉన్న పునీత ఆంథోని చర్చిని నూతన హంగులతో ఆదివారం పునఃప్రారంభించారు. ఆ చర్చిలో గోల్డెన్‌జూబ్లీ ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రార్థనలు జరిపి భక్తులకు అన్నదానం చేశారు.

ప్లాస్టిక్ ముప్పును నివారించాలి

నెల్లూరు(సాంస్కృతికం), జూన్ 1(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వల్ల కలుగుతున్న కాలుష్యాన్ని నివారించేందుకు ప్రజలందరూ అవగాహనతో మెలగాలని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి జిల్లా పర్యావరణ ఇంజనీర్ ఎస్ అశోక్ పిలుపునిచ్చారు. ఈనెల 5వతేదీన ప్రపంచ కాలుష్య నియంత్రణ దినోత్సవం సందర్భంగా ఆదివారం నగరంలోని ఆర్టీసీ బస్టాండు, ఏసీ కూరగాయల మార్కెట్, రైల్వేస్టేషన్లలో ఆయన ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు, కళాజాతాలు జరిగాయి. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ మార్గాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

భగత్‌సింగ్ కాలనీ వాసులకు

త్వరలో ఇళ్ల పట్టాలు

- మంత్రి నారాయణ వెల్లడి
- జనార్దన్‌రెడ్డి కాలనీలో షాదీమంజిల్‌కు శంకుస్థాపన
- నగరంలో కొత్త స్వీపింగ్ మిషన్ల ప్రారంభం

నెల్లూరు(సిటీ), జూన్ 1,(ఆంధ్రజ్యోతి) : నగరంలోని వెంకటేశ్వరపురం భగత్‌సింగ్ కాలనీ వాసులకు త్వరలో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఇంటి స్థల పట్టాలు అందచేయనున్నట్లు మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఆదివారం జనార్దన్‌రెడ్డి కాలనీ వద్ద రూ. కోటితో షాదీ మంజిల్ నిర్మాణానికి శంకుస్థాన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తాను రూ. 50 లక్షలు, ఎంపీ వీపీఆర్ మరో రూ.50 లక్షలతో షాదీ మంజిల్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. రూ.కోటి చెక్కును కమిషనర్ నందన్‌కు అందచేశారు. నెల్లూరు సిటీలో తన గెలుపునకు మైనార్టీలు ఎంతగానో దోహదపడ్డారని మంత్రి పేర్కొన్నారు. షాదీ మంజిల్ నిర్మాణానికి అదనంగా నిధులు అవసరమైతే కార్పొరేషన్, వక్ఫ్‌బోర్డు నుంచి సమీకరిస్తామని తెలిపారు. కాగా, ఈ కార్యక్రమానికి నగరంలో రోడ్లు శుభ్రం చేసేందుకు తెప్పించిన త్రీడీ మీటర్ల స్వీపింగ్ మిషన్లను మంత్రి, ఎంపీ ప్రారంభించారు. ఈ కార్యక్రమాలలో ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ బూదాటి రాధయ్య, తహసీన్, అనురాధ తదితరులు పాల్గొన్నారు.



పచ్చ జెండా ఊపి స్వీపింగ్ యంత్రాలను ప్రారంభిస్తున్న మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి

10కల్లా వీఆర్ స్కూలు సిద్ధం చేయాలి

నెల్లూరు(విద్య), జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వీఆర్ ఉన్నత పాఠశాల అభివృద్ధి పనులు వేగవంతం చేసి ఈ నెల 10వతేదీకి సిద్ధం చేయాలని మంత్రి నారాయణ అధికారులను ఆదేశించారు. ఆ పాఠశాల పనులను మంత్రి ఆదివారం పరిశీలించారు. స్కూలును అత్యాధునికంగా తీర్చిదిద్ది పునఃప్రారంభించేందుకు సర్వం సిద్ధం చేస్తున్నామని చెప్పారు. డిజిటల్ తరగతులు, క్రీడా మైదానంతోపాటు ఫర్నిచర్, ఇతర సౌకర్యాలన్నిటినీ గడువులోపు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అలాగే, నగరంలోని మూలాపేటలో ఉన్న ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలను కూడా మంత్రి నారాయణ పరిశీలించారు. అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి తెలుసుకున్నారు. నిరుపయోగంగా మారిన హెచ్‌ఎం గదులను పరిశీలించి, వాటిని వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలను దత్తత తీసుకుని ఆధునీకరించేందుకు ముందుకొచ్చిన డీఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్ సంస్థ ప్రతినిధులను అభినందించారు. ప్రభుత్వ తోడ్పాటుతోపాటు దాతల సహకారంతోనే ప్రభుత్వ బడుల రూపురేఖలు మారుతాయని చెప్పారు. జూన్ 12 నాటికి పనులన్నీ పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో కమిషనర్ నందన్, డీఈవో బాలాజీ రావు, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

ఒక్కో మహిళకు వ్యాపారానికి రూ.లక్ష సాయం

నెల్లూరు(హరనాథపురం), జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : మహిళా సాధికారత ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. ఆదివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో మెప్మా అధికారు లు, సభ్యులతో సమీక్ష జరిపారు. మైపాడు గేటు సెంటర్లో 200 షాపులకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ప్రతి మహిళకు తన వంతుగా ఒక లక్ష రూపాయలు సాయం చేస్తానని ప్రకటించారు. మహిళల ఆర్థికాభివృద్ధికోసం ఈ దుకాణాలు కేటాయిస్తున్నట్లు వివరించారు. 20 రోజుల్లో స్మార్ట్ బజార్ ను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని తెలిపారు. తమ వ్యాపారాభివృద్ధికి రెండు కోట్ల సొంత నిధులను ప్రకటించిన మంత్రి నారాయణకు మెప్మా మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ లీలారాణి తదితరులు పాల్గొన్నారు.

దేవరపాళెంలో ఇన్‌చార్జి కలెక్టర్

రేషన్ సరుకుల పంపిణీ

నెల్లూరు రూరల్(ఆంధ్రజ్యోతి) : రూరల్ మండలం దేవరపాళెంలో ఇన్‌చార్జి కలెక్టర్, జేసీ కార్తీక్, రాష్ట్ర పౌరసర పరాల సంస్థ డైరెక్టర్ పట్టాభిరామిరెడ్డి, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ఆదివారం ప్రజలకు రేషన్ సరుకులు అందచేశారు. డీలర్ల ద్వారానే నిత్యసరాలను ప్రజలకు అందించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో ఈ మేరకు తెల్లరేషన్ కార్డుదారులకు వాటిని పంపిణీ చేశారు. కాగా, దొంతాలి గ్రామంలోని డంపింగ్ యార్డులో రూ.24 కోట్లతో ఏర్పాటు చేస్తున్న లెగసీ వ్యర్థాల బయో మైనింగ్ పనులను టీడీపీ నాయకులు ప్రారంభించారు. ఈ కార్యక్రమాలలో ఎంపీపీ విజయకుమార్, వేదగిరి క్షేత్రం మాజీ చైర్మన్లు శ్రీనివాసులురెడ్డి, సురేందర్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు పముజుల ప్రదీప్ పాల్గొన్నారు.



రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్, టీడీపీ నాయకులు

సద్వినియోగం చేసుకోండి

- టీడీపీ నేత ధర్మవరం

నెల్లూరు (వైద్యం,ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకు వచ్చిన రేషన్ దుకాణాల ద్వారా సరుకుల పంపిణీ విధానాన్ని కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు కోరారు. ఆదివారం నగరంలోని 47వ డివిజన్‌లో రేషన్ దుకాణాల ద్వారా ఆయన సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గణేష్‌కుమార్, శశిధర్, వంశీ, మహేశ్వర రావు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ, మంచి ఆలోచనతో ఉజ్వల భవిత

- రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి పార్థసారథి

నెల్లూరు(హరనాథపురం), జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : క్రమశిక్షణ, మంచి ఆలోచనతోనే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఆదివారం నగరంలోని యాదవ భవన్‌లో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన యాదవ విద్యార్థులకు యాదవ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కార ప్రదానోత్సవం జరిగింది.



విద్యార్థినికి పురస్కారం అందచేస్తున్న మంత్రి

మంత్రి మాట్లాడుతూ విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాని సాధనకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు. యాదవ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ మాదాల వెంకటేశ్వరరావు-సుజాతమ్మ దంపతులను, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్‌ను మంత్రి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్ రావు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్య క్షుడు చెవుల రామచంద్రయ్య, పీలం సురేష్‌బాబు, యాదవ ట్రస్టు భవన్ మేనేజింగ్ ట్రస్టీ బొమ్మి నాగ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

విద్య ప్రాధాన్యతను గుర్తించాలి : గ్రోసు సుబ్బారావు

నెల్లూరు(హరనాథపురం), జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : విద్య ప్రాధాన్యతను గాండ్ల, తెలికుల కులస్థులు గుర్తించాలని అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గ్రోసు సుబ్బారావు కోరారు. ఆదివారం నగరంలోని మహేశ్వరి-పరమేశ్వరి కల్యాణ మండపంలో ఆయన అధ్యక్షతన గ్రోసు గోపాలయ్య జ్ఞాపకార్థం పదో వతరగతి, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బంగారు పతకాలు ప్రదానం చేశారు. సుబ్బారావు మాట్లాడుతూ గాండ్ల తెలికుల కుల విద్యార్థులందరూ బాగా చదువుకుంటే సామాజికంగా అభివృద్ధి సాధించగలమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొర్రా మధుసూదన్, ఢిల్లీలోని తెలి సాహు మహా సంఘటన్ జాతీయ అధ్యక్షుడు మురారి సాహు గుప్తా, ఉపాధ్యక్షుడు దీనదయాళ్ సాహు, యువజన అధ్యక్షుడు అశోక్ సాహు, జాతీయ మహిళా ఉపాధ్యక్షురాలు సంకిన భవాని ప్రియ, జేఏసీ వైస్ చైర్మన్ అడ్డా వెంకటరాజు, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు నరవ అనంతం తదితరులు పాల్గొన్నారు.



బాలికకు బంగారు పతకం అందచేస్తున్న సుబ్బారావు

దేవాంగ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు

నెల్లూరు(హరనాథపురం), జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పదో తరగతి, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన దేవాంగ విద్యార్థులకు ఆదివారం నెల్లూరు జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అందచేశారు. పొదలకూరు రోడ్డులోని హెచ్‌ఆర్ కల్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో 115 మంది విద్యార్థులకు నగదు బహుమతి, జ్ఞాపిక అందచేశారు. సామాజిక, ఆర్థిక పరమైన వెనుకబాటు తనాన్ని విద్యలో ప్రతిభతో అధిగమించాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నాయకుడు పముజుల దశరథరామయ్య, మన్నెం రవీంద్రనాథ్ ఠాగూర్, గౌరబత్తిన శివయ్య, డాక్టర్ మన్నెం సతీష్, పముజుల శంకరయ్య, కొండా మాధవయ్య, సజ్జ నవోదయ తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభా పురస్కారాలతో దేవాంగ విద్యార్థులు

జనసేన కార్యకర్తలకు సభ్యత్వ కార్డుల పంపిణీ

మనుబోలు, జూన్ 1 (ఆంధ్ర జ్యోతి): మండల కేంద్రమైన మనుబోలులో ఆదివారం జన సైనికులు, కార్యకర్తలకు క్రియాశీలక సభ్యత్వాల కార్డులను అందజేశారు. ఈసందర్భంగా జనసేన మండలాధ్యక్షుడు పెనుబాక ప్రసాద్ మాట్లాడుతూ మండలవ్యాప్తంగా 500 క్రియాశీలక సభ్యత్వాలు చేయించామన్నారు. ఇందుకు సంబంధించి తొలుత 50మంది కార్యకర్తలకు ఇళ్ళకు వెళ్ళి కార్డులను అందించామన్నారు. కార్యకర్తకు సభ్యత్వంతో పాటు, ప్రమాదబీమా సౌలభ్యం ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు జాకీర్, పెనుబాక మహేష్, ఖాదర్‌వల్లీ, శ్రీను, కోటి,కిరణ్, తదితరులు పాల్గొన్నారు.



జనసేన సభ్యత్వ కార్డును అందజేస్తున్న జనసేన మండలాధ్యక్షుడు పెనుబాక ప్రసాద్

●తోటపల్లిగూడూరు : మండలంలోని పాపిరెడ్డిపాళెం అరుంధతివాడలో ఆదివారం జనసేన సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు ఆధ్వర్యంలో జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం బొబ్బేపల్లి మాట్లాడుతూ గ్రామస్థాయిలో జనసేన పార్టీని బలోపేతం చేసేందుకు జనసైనికులు కష్టపడి పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ వాణిభవాని, మండలాధ్యక్షుడు సందీప్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై కారు - లారీ ఢీ

- త్రుటిలో తప్పిన ప్రమాదం

మనుబోలు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మనుబోలు జాతీయ రహదారిపై మనుబోలు వద్ద కారు, లారీ ఢీకొన్న సంఘటన ఆదివారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. కృష్ణాజిల్లా కైకలూరుకు చెందిన వెంకటరమణ తన కుటుంబసభ్యులతో కలిసి కారులో తిరుమల వెళుతున్నారు. కారు మనుబోలు ఫ్లైఓవర్ దిగగానే ముందు వెళుతున్న వాహనాన్ని అధిగమించే ప్రయత్నంలో అదుపుతప్పి మలుపు తిరిగింది. అయితే కారు డ్రైవర్ చాకచక్యంగా కారు డివైడర్‌పైకి దూసుకెళ్ళకుండా నిలుపుదల చేశాడు. అదేక్రమంలో లారీ డ్రైవర్ కూడా వేగాన్ని అదుపుచేశాడు. కాగా, కారు, లారీ డ్రైవర్ల చాకచక్యంతో పెనుప్రమాదం తప్పింది. ఈఘటనలో ఎవ్వరికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఇటు ప్రయాణికులు, అటు పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదం కారణంగా ట్రాఫిక్ నిలిచిపోవడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెంకటాచలం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇస్కపాళెం సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే బుజబుజనెల్లూరు ప్రాంతానికి చెందిన నిరంజన్, శివకుమార్ ఇద్దరూ కలిసి పంటపాళెనికి వెళ్లి తిరిగి వస్తుండగా ఇస్కపాళెం దాటిన తర్వాత తూము దగ్గర మలుపు వద్ద ఎదురుగా వస్తున్న ఆటో బైక్‌ను ఢీకొంది. దీంతో బైక్ బోల్తాపడి ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీపంలోని పీహెచ్‌సీకి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కసుమూరులో భక్తుల రద్దీ

వెంకటాచలం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కసుమూరు మస్తాన్ వలీ దర్గాలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. తమిళనాడు, కేరళ, కర్ణాటక, తెలంగాణ తదితర రాష్ట్రాలతోపాటు మన రాష్ట్ర నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి మస్తాన్ వలీ దర్గాను సందర్శించారు. భక్తులు షాఫాబావిలో పుణ్యస్నానాలు అచరించి మస్తాన్‌స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం

కోవూరు, జూన్1 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చెర్లోపాళెం ప్రాథమిక పాఠశాలలో 1997 నుంచి 2009 వరకు చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. తమకు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. పాఠశాలలో గడిపిన మధుర జ్ఞాపకాల్ని గుర్తుకు తెచ్చుకున్నారు. పూర్వ విద్యార్థి డాక్టర్ ఐ ఉమామహేష్‌ను సత్కరించారు.

ప్రధానోపాధ్యాయురాలిగా అమూల్యకుమారి

మనుబోలు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా అమూల్యకుమారి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె సిబ్బందిని పాఠశాల స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు.

గోకులాల బిల్లుల కోసం ఎదురుచూపులు

- నాలుగు నెలలైనా జరగని చెల్లింపులు ● పశుపోషకుల ఆవేదన

మనుబోలు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): గోకులాల నిర్మాణాలు పూర్తిచేసి నాలుగునెలలైనా ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయలేదని పశుపోషకులు వాపోతున్నారు. ఉపాధిహామీ పథకం ద్వారా గోకులాల నిర్మాణాలు చేపట్టేందుకు ప్రభుత్వం పశు పోషకులకు పెద్దఎత్తున రాయితీ ప్రకటించింది. దీంతో పశువులకు సౌకర్యంగా ఉంటుందన్న భావనతో వారు సంబంధిత శాఖ నుంచి అనుమతులు తీసుకుని గోకులాల నిర్మాణాలు చేపట్టారు. రెండు పశువులకు రూ. 1.15 లక్షలు, నాలుగు పశువులకు రూ.1.85 లక్షలు, 6 పశువులకు రూ. 2.30 లక్షల చొప్పున మంజూరు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటిం చింది. అందులో 90శాతం ప్రభుత్వం రాయితీ కల్పించింది. నిర్మాణం పూర్తయిన తరువాత బిల్లుల చెల్లింపునకు ఏర్పాట్లు చేసింది. ఈ క్రమంలో మండలంలోని 19 పంచాయతీలకు గాను తొలి విడతలో 17 గోకులాలను మంజూరు చేశారు. 16 గోకులాల నిర్మాణాలు పూర్తిచేశారు. పనులు పూర్తిచేసిన వెంటనే బిల్లులు వస్తాయన్న ఆశతో పశుపోషకులు యుద్ధ ప్రాతిపదికన నిర్మాణాలు పూర్తిచేశారు. అయితే పనులు పూర్తిచేసి నాలుగునెలలు గడుస్తున్నా ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయలేదు. దీంతో గోకులాల నిర్మాణాలను అప్పుచేసి నిర్మించామని, వడ్డీలు పెరుగుతున్నాయని పశుపోషకులు వాపోతున్నారు. కాగా, తొలివిడతలో నిర్మాణాలు పూర్తిచేసిన వాటికే బిల్లులు మంజూరు చేయకపోగా, రెండో విడతలో మండలానికి 35 గోకులాలు మంజూరుచేశారు. దీంతో వాటిని నిర్మించేం దుకు రైతులు ఆసక్తి చూపడం లేదు. ఇదే తరహాలో ఉపాధిహామీ కింద పశువుల కోసం పొలాలు, రోడ్డు మార్గాల్లో మండలంలో 10 నీటితొట్లు నిర్మించారు. వాటికి బిల్లులు మంజూరు చేయలేదు. నిర్మాణాలు చేసిన రైతులు లబోదిబోమంటున్నారు.



వెంకన్నపాళెంలో నిర్మించిన గోకులం షెడ్

జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాం : రాజమ్మ, ఏపీవో

గోకులాలు, నీటితొట్ల నిర్మాణాలకు సంబంధించి పశుపోషకులకు రావాల్సిన బిల్లుల చెల్లింపులపై జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్ళాం. నిర్మాణాలు పూర్తిచేసిన రైతుల వివరాలు, ఎంబుక్‌లు సిద్ధంచేసి పంపాం. వారం, పదిరోజుల్లో బిల్లులు వచ్చే అవకాశం ఉందని జిల్లా అధికారులు తెలిపారు. కావున పశుపోషకులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

కార్డుదారులందరికీ నిత్యావసర సరుకులు అందించాలి

- కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

కోవూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కార్డుదారులందరికీ నిత్యావసర సరుకులు సకాలంలో అందించాలని రేషన్‌డీలర్లకు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సూచించారు. స్థానిక మందబయలు కూడలిలోని డీలరు ఖుద్దూష్ బాషా దుకాణంలో సరుకుల పంపిణీని ఆదివారం ఆమె ప్రారంభించారు. వాహనాల ద్వారా పంపిణీ స్థానంలో ప్రభుత్వం పాత పద్ధతిని పునరుద్ధరించిందని చెప్పారు. ఇకనుంచి 15 రోజుల్లో కార్డుదారులు ఎప్పుడైనా చౌక దుకాణానికి వెళ్లి సరుకులు తీసుకోవచ్చని తెలిపారు. 60 సంవత్సరాలు దాటిన కార్డుదారులకు ఇంటి వద్దే సరుకులు అందిస్తారని పేర్కొన్నారు. కార్డుదారులందరికీ సరుకులు పంపిణీచేసే విధంగా స్థానిక నాయకులు చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు నిర్మలానంద బాబా, డీలర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, పెన్నా డెల్టా చైర్మన్ జెట్టి రాజగోపాలరెడ్డి, నాయకులు చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, కొల్లారెడ్డి సుధాకరరెడ్డి, ఇంతా మల్లారెడ్డి, గాదిరాజు అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యంతో ముందుకు సాగండి

విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకుని దాని సాధనకు కష్టపడి చదవాలని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి సూచించారు. స్థానిక బుద్ధి పద్మావతి కల్యాణ మండపంలో ఆదివారం దేవాంగ సంక్షేమ సంఘం ఏర్పాటు చేసిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పిచ్చుక మధుసూదనరావు, భువన మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అంద జేశారు.



కోవూరు : సరుకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

●ముత్తుకూరు: టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రజాపంపిణీ వ్యవస్థ మెరుగ్గా పని చేస్తుందని మండల టీడీపీ అధ్యక్షుడు నీలం మల్లికార్జునయాదవ్ తెలిపారు. ఆదివారం నిర్వాసిత కాలనీలో రేషన్ దుకాణంలో సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ స్వప్న, ఉప తహసీల్దార్ ప్రదీప్, ఆర్ఐ వెంకటేష్, టీడీపీ నాయకులు బోలిగర్ల శ్రీనువాసులు, ఏడు కొండలు, శంకర్, ఎల్లయ్య, డీలర్ల అసోసియేషన్ నాయకులు అబ్దుల్‌షరీఫ్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొ న్నారు.

●తోటపల్లిగూడూరు : కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన తరువాత పేదలకు అందుబాటులో రేషన్ దుకాణాలు ఏర్పాటుచేశామని టీడీపీ సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఈసందర్భంగా మండలంలోని నరుకూరు, తోటపల్లి గూడూరు గ్రామాలలో ఆదివారం చౌకదుకాణాలలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొమ్మి సురేంద్ర, పార్టీ అధ్యక్షుడు కొణతం రఘుబాబు, మన్నెం జితేం ద్ర, మన్నెం మధుసూదన్‌గౌడ్, చేవూరు శ్రీనువాసులు, కిరణ్‌గౌడ్, అన్నం శ్రీనువాసులు పాల్గొన్నారు.

●మనుబోలు: మండలవ్యాప్తంగా ఆదివారం 28 చౌకడిపోల వద్ద కార్డుదారులకు నిత్యావసర సరుకుల పంపిణీ ప్రారంభించారు. మనుబోలులో ఓ రేషన్ దుకాణం వద్ద సరుకులు అందించే కార్య క్రమంలో జడ్పీటీసి చిట్టమూరు అనితమ్మ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాయపాటి కిరణ్‌కుమార్, కలికి రమేష్‌రెడ్డి, దండు చంద్రశేఖర్‌రెడ్డి, రావుల అంకయ్య గౌడ్, చల్లగిరి ప్రసాద్, వీఆర్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

జక్కా వెంకయ్యకు ఘన నివాళి



పెనుబల్లిలో వెంకయ్య వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం నేతలు

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమానికి పుచ్చలపల్లి సుందరయ్య కృషి చేస్తే ఆయన స్ఫూర్తితో జక్కా వెంకయ్య నెల్లూరు జిల్లాలో పార్టీ నిర్మాణానికి ఎనలేని కృషి చేశారని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ అన్నారు. ఆదివారం పెనుబల్లిలో వెంకయ్య 7వ వర్ధంతి నిర్వహించారు. వెంకయ్య సాగించిన పోరాటాలను నెమరువేసుకున్నారు. ఈకార్యక్రమంలో నాయకులు చంద్ర రాజగోపాల్, జక్కా శేషమ్మ, చల్లకొలుసు మల్లికార్జున, నన్నం మాధవ్, బాబు, లక్ష్మణ పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధం

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగానికి విరుద్ధమని ఎస్‌డీపీఐ జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యుడు, న్యాయవాది సయ్యద్ కాశిఫ్ అన్నారు. ఆదివారం బుచ్చిరెడ్డిపాళెం అంబేడ్కర్ భవన్‌లో సోషల్ డెమొ క్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు షేక్ అజీజ్, స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబరు షేక్ ఫయాజ్ నియోజకవర్గ ఇన్‌చార్జి మహబూబ్ బాషా అధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వక్ఫ్ చట్ట సవరణతో కలిగే నష్టాలను వివరించారు. దీనిపై పోరాడాలని, పార్టీని బలోపేతం చేయాలన్నారు.

చిత్రకళలో విద్యార్థులకు పోటీలు

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): చిత్రకళను నేర్చుకోవడం ద్వారా మానసిక ఒత్తిడి, ఆందోళన తగ్గి, ఏకాగ్రత పెరుగుతుందని బుచ్చి బెజవాడ బుజ్జమ్మ బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం సుజాత అన్నారు. స్థానిక హౌస్‌తోటలోని ఆమె నివాసంలో వేసవి శిక్షణ శిబిరం ఏర్పాటు చేసి డ్రాయింగ్ మాస్టర్ డీ శేషయ్యతో చిత్రకళలో విద్యార్థులకు మెలకువలు నేర్పిస్తున్నారు. ఆదివారం శిబిరం ముగింపు సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. డ్రాయింగ్ మాస్టర్‌ను సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో గండికోట సుధీర్‌కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.





ప్రజల సొమ్మంటే ఇంత నిర్లక్ష్యమా ?

● తుప్పుపడుతున్న సుజలధార ట్యాంకర్లు, ట్రాక్టర్లు

అనంతసాగరం ఎంపీడీవో కార్యాలయం వద్ద సుజలధార పథకానికి చెందిన సుమారు 15 ట్రాక్టర్లు, ట్యాంకర్లను నిర్లక్ష్యంగా ఉంచేశారు. దీంతో అవి ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ తుప్పుపడుతున్నాయి. కొన్ని ట్రాక్టర్లకు పైన టాపులు మాయం కాగా, మరి కొన్నింటికి ఇతర వస్తువులు కనిపించడం లేదు. ఒక ట్రాక్టరుకు మాత్రం టైర్లు కూడా లేవు. ప్రభుత్వ ధనం మంటే ప్రజలసొమ్ము కాదా? అధికారులు మరీ ఇంత నిర్లక్ష్యం వహిస్తే ఎలా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

- అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి)



మామిడి మాటున విషం

కొందరు వ్యాపారులు స్వార్థంతో మామిడి పండ్ల మాటున విషాన్ని విక్రయిస్తున్నారు. మంచి రంగును చూసి వాటిని తిని ప్రజలు అనారోగ్యాన్ని కొనితెచ్చుకుంటున్నారు. దీనికి కారణం రసాయనాలతో మాగబెట్టడమే. జిల్లా వ్యాప్తంగా వ్యాపారులు కార్బైడ్‌తో మాగపెట్టిన మామిడి పండ్లను విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యాన్ని హరిస్తున్నారు. అడ్డుకోవాల్సిన సంబంధిత అధికారులు మామూళ్లను మరిగి అటువైపు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు ఉన్నాయి.

- సంగం, (ఆంధ్రజ్యోతి)

తెలుగు మీడియం అమలు చేయాలి

● ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజులు నియంత్రించాలి

నెల్లూరు(విద్య), జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో మాతృభాష అయిన తెలుగు మీడియంను పక్కాగా అమలు చేయడంతోపాటు ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజులను నియంత్రించాలని ది పేరెంట్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. నెల్లూరులోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఆదివారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. విద్యాహక్కు చట్టాన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో అమలు చేయడంతో పాటు ఆసర్ నివేదికపై బహిరంగ చర్చ జరిపి పిల్లలకు నాణ్యమైన విద్యనందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీ అధికమైందని, దీని నియంత్రణకు రెగ్యులేషన్ అండ్ మానిటరింగ్ కమిషన్ చట్టం ప్రకారం చర్యలు చేపట్టాలన్నారు. పదో తరగతి పరీక్షల నిర్వహణ తీరు, మూల్యాంకనం చేసిన విధానంపై శ్వేతపత్రం విడుదల చేసి విద్యార్థులు నష్టపోవడానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యా రంగ పరిరక్షణపై కార్యాచరణ రూపొందించామని, దీనిలో భాగంగా త్వరలో ఉద్యమాలకు శ్రీకారం చుడతామని ప్రకటించారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ నరహరి, జిల్లా అధ్యక్షకార్యదర్శులు కోటా శ్రీనివాసులు రెడ్డి, ఉడతా రాజశేఖర్ యాదవ్ పాల్గొన్నాయి.

2030 కల్లా మలేరియాను నిర్మూలించాలి

● జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత



ప్రదర్శనలో వైద్యాధికారులు, సిబ్బంది, పీఎంపీలు

నెల్లూరు (వైద్యం), జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 2030వ సంవత్సరానికల్లా మలేరియా వ్యాధిని నిర్మూలించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత వెల్లడించారు. మలేరియా నివారణ మాసోత్సవాలను పురస్కరించుకుని వైద్యశాఖ ఆదివారం నెల్లూరులో అవగాహన ప్రదర్శన నిర్వహించింది. డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి బోసుబొమ్మ వరకు ఈ ప్రదర్శన సాగింది. ఆమె మాట్లాడుతూ ఎనాఫిలిస్ ఆడ దోమ కాటుతో మలేరియా వ్యాధి సోకుతుందని చెప్పారు. వాంతులు, చలి, వణుకుతో కూడిన తీవ్ర జ్వరం వంటి లక్షణాలు ఉంటాయని, 8 నుంచి 12 రోజుల్లో లక్షణాలు బయట పడతాయని తెలిపారు. వెంటనే వైద్యుని వద్ద చికిత్స చేయించు కోవాలని సూచించారు. ప్రాణాంతకమైన మలేరియా వ్యాధిపై ప్రజలకు పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ మాట్లాడుతూ మలేరియా వ్యాధి అంతం కోసం సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి, మలేరియా నివారణ జిల్లా అదనపు అధికారి నాగార్జునరావు, వైద్యశాఖ సిబ్బంది, పీఎంపీలు పాల్గొన్నారు.

అప్రైజర్లు ఉద్యోగులతో సమానంగా సేవలందించాలి

● ఏపీజీబీ చీఫ్ మేనేజర్ ఆంజనేయులు



కరపత్రాలు విడుదల చేస్తున్న అప్రైజర్లు, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు

నెల్లూరు(హరనాథపురం), జూన్ 1(ఆంధ్రజ్యోతి) : బ్యాంకుల్లో పనిచేసే అప్రైజర్లు బ్యాంకు ఉద్యోగులతో సమానంగా సేవలందించి, బ్యాంకు అభివృద్ధికి పాటుపడాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు చీఫ్ మేనేజర్ ఆంజనేయులు సూచించారు. ఆదివారం నెల్లూరులోని ఓ ఫంక్షన్ హాల్లో ఏపీజీబీ జ్యువెల్ అప్రైజర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ అప్రైజర్ల సేవలు బ్యాంకులకు ఎంతో అవసరమన్నారు. జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఖాజన వెంకట శేషయ్య మాట్లాడుతూ జిల్లాలోని విశ్వబ్రాహ్మణ స్వర్ణకారులకు బ్యాంకు అప్రైజర్లుగా అవకాశం కల్పించాలని కోరారు. అప్రైజర్లుగా అవకాశం కల్పిస్తే స్వర్ణకార వృత్తి నైపుణ్య సర్టిఫికెట్, కార్డులు అందచేస్తా మని చెప్పారు. ఈ సందర్భంగా అప్రైజర్ల పోరాటాలు, విజయాలపై రూపొందించిన కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసాచారి, రాఘవేంద్రాచారి, రవిశంకర్, కొండలరావు, రాఘవాచారి, నాగేంద్ర, గురుబ్రాహ్మం తదితరులు పాల్గొన్నారు.

చోరీ జరిగిన ఐదు రోజులకు స్పందన

● ఇదీ సాగరం పోలీసుల తీరు !

అనంతసాగరం జూన్ 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెరువు కట్ట సమీపంలో వెలసి ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో గత నెల 28న చోరీ జరిగింది. హుండీలోని రూ 4 వేల నగదు, వెండి వస్తువులు, మైక్ సామగ్రి చోరీ జరిగింది. మరుసటి రోజు చోరీ జరిగిన విషయంపై అర్చకుడు తిరుపాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే సిబ్బంది సైతం చోరీ జరిగిన ప్రాంతానికి వెళ్లి పరిశీలించిన దాఖలాలు లేవు. తీరికగా ఆదివారం సాయంత్రం వెళ్లి చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. దీంతో పోలీసుల నిర్లక్ష్యంపై భక్తులు ఆగ్రహః వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఎస్ఐ సూర్యప్రకాష్‌రెడ్డిని వివరణ కోరగా తాను అందుబాటులో లేనని, చోరీ జరిగిన విషయం ఆదివారం తన దృష్టికి వచ్చిందని చెప్పడం గమనార్హం.



చోరీ జరిగిన ఆలయంలో పరిశీలిస్తున్న పోలీసులు

పనిముట్లు లేకుండా పనులెలా.. ?

● ప్రభుత్వం పంపిణీ చేయని పలుగు, పార ● 'ఉపాధి' శ్రామికులకు తప్పని కష్టాలు

ఉదయగిరి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదల జీవితాలకు కొండంత అండగా ఉండే ఉపాధి హామీ పథకం నీరుగారిపోతోంది. గత ప్రభుత్వ హయాంలో తీసుకున్న నిర్ణయాలు శ్రమజీవుల పాలిట శరాఘాతంగా మారాయి. ఉపాధి కావాలంటే పలుగు, పార, తట్టా, బుట్టా సర్దుకుని వెళ్లాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని 38 మండలాల్లో 2.8 లక్షల జాబ్‌కార్డులు యాక్టివ్‌లో ఉండగా, 4.42 లక్షల మంది శ్రామికులు ఉన్నారు. ప్రతిరోజు 70 నుంచి 80 వేల మంది ఉపాధి పనులు చేస్తున్నారు. అయితే గత ప్రభుత్వ హయాంలో తవ్వకం పనులకు శ్రామికులకు పరికరాలు ఇవ్వడాన్ని నిలిపివేసింది. అప్పటి నుంచి సొంత డబ్బులు వెచ్చించి కొనుగోలు చేసి వెళుతున్నారు. వీటి కోసం ఒక్కొక్కరు వారానికి కనీసం రూ.500ల వరకు వెచ్చించాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. స్థోమత లేనివారు పాత వాటిలో తవ్వకాలు చేస్తూ నానా కష్టాలు పడుతున్నారు.

● గత ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే...

నిబంధనల మేరకు శ్రామికుల వేతనాలకు 60 శాతం, సామగ్రికి 40 శాతం ఉపాధి నిధులు వెచ్చించాల్సి ఉంది. సామగ్రి నిధులతో గడ్డపార, మట్టి ఎత్తేందుకు చలకపార, తట్టలు, నీడ కోసం టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు కొనుగోలు చేయాల్సి ఉంది. ఇవికాక మొద్దుబారిన పార, పలుగులు సానబట్టే ఖర్చులు కూడా ఇందులో నుంచే వెచ్చించాలి. అయితే గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కారణంగా గ్రామీణాభివృద్ధి శాఖ పరికరాల కొనుగోళ్లను నిలిపివేసింది. కూటమి ప్రభుత్వమైనా స్పందించి శ్రామికులకు పనిముట్లు అందజేయాలని పలువురు ఉపాధి హామీ పథకం శ్రామికులు కోరుతున్నారు.

ఉపాధి హామీ పనులు చేస్తున్న శ్రామికులు (ఫైల్)



చికిత్స పొందుతూ వివాహిత మృతి

సంగం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నవరపాడుకు చెందిన కోట నాగలక్ష్మి అనే వివాహిత వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. నాగలక్ష్మి భర్తతో గొడవపడి మనస్పర్థల కారణంగా ఈ నెల 22వ తేదీన పురుగుల మందు తాగింది. గమనించిన భర్త నెల్లూరు వైద్యశాలకు తరలించడంతో అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ వ్యర్థాల వాహనం పట్టివేత

సంగం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాతీయ రహదారిపై చికెన్ వ్యర్థాలు తరలించే మినీ వ్యానును ఆదివారం సంగం పోలీసులు పట్టుకున్నారు. పడమటిపాళెంలోని చేపల గుంటల కోసం బెంగుళూరు నుంచి మినీ వ్యానులో 10 డమ్ముల చికెన్ వ్యర్థాలను తరలిస్తుండగా పోలీసులు పట్టుకుని వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

అనుమానంతో భార్యపై భర్త దాడి



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రమ

నెల్లూరు(క్రైం), జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని రామ్మూర్తి నగర్‌లో భార్యపై అనుమానంతో భర్త కత్తితో దాడి చేశాడు. పోలీసుల సమాచారం మేరకు... నగరంలోని శ్రామిక్‌నగర్‌లో శ్రీనాథ్, రమ దంపతులు నివసిస్తున్నారు. వారికి ఇద్దరు కుమారులు. శ్రీనాథ్ ఆటో నడుపుతూ, రమ బ్యూటీషియన్‌గా పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. శ్రీనాథ్ నిత్యం మద్యం సేవించి భార్యను అనుమానించి ఆమెతో గొడవపడేవాడు. భార్యను కొట్టి ఇంట్లో నుంచి బయటకు తరిమేసేవాడు. ఇలా గొడవ జరుగినప్పుడు పెద్దలు ఇద్దరికి సర్దిచెప్పి కలిపేవారు. అయితే రెండు నెలల కిందట భార్యభర్తల మధ్య గొడవ జరిగిన తర్వాత కాపురాన్ని పొదలకూరురోడ్డులోని రమ పుట్టింటికి మార్చారు. రమ రామ్మూర్తినగర్‌లోని ఓ మేకప్ సెలూన్‌లో బ్యూటీషియన్‌గా పనిచేస్తోంది. ఆదివారం ఉదయం ఆ సెలూన్‌లోకి వెళుతుండగా భర్త శ్రీనాథ్ మచ్చు కత్తితో రమ తల, కుడి భుజము, ఎడమ చేతిపై నరికాడు. రక్తపు గాయాలతో ఆమె కుప్పకూలిపోయింది. చుట్టుపక్కల వారు అక్కడికి రావడంతో శ్రీనాథ్ పరారయ్యాడు. స్థానికులు రమను చికిత్స నిమిత్తం జయభారత్ వైద్యశాలలో చేర్పించారు.

ఉపాధ్యాయుల సర్‌ప్లస్ ప్రకటన అన్యాయం

● విద్యాశాఖ కార్యాలయం ఎదుట ఏపీటీఎఫ్ ఆందోళన



జిల్లా విద్యాశాఖ కార్యాలయం వరండాలో బైఠాయించి నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

నెల్లూరు(విద్య), జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : జీవో నెం 22ను అతిక్రమించి నిరంకుశంగా జిల్లాలో 196 మంది ఉపాధ్యాయులను సర్‌ప్లస్‌గా ప్రకటించడం అన్యాయమని, దీనిని వెంటనే ఉపసంహరించుకోవాలని ఉపాధ్యాయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయ బదిలీల్లో రీఅపోర్షన్‌మెంట్ కింద ఏర్పాటు చేసిన మోడల్ ప్రైమరీ స్కూల్స్ ప్రధానోపాధ్యాయులుగా ఎస్‌జీటీలకు ఉద్యోగోన్నతి కల్పించాలని కమిషనర్‌ను కోరామన్నారు. దానిని పట్టించుకోకుండా 117 జీవోను రద్దు చేస్తున్నామని చెబుతూనే అంతకన్నా ఇబ్బందికరమైన జీవో నెం 21ను తీసుకువచ్చారని ఆరోపించారు. దీనివల్ల అనేకమంది సరప్లస్‌గా మిగులుతున్నారన్నారు. వీరిని మోడల్ ప్రైమరీ స్కూళ్లకు హెచ్‌ఎంలుగా పంపించడం వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందన్నారు. జిల్లాలో 196 మందిని సర్‌ప్లస్‌గా ప్రకటించి ట్రాన్స్‌ఫర్ దరఖాస్తు గడువు ముగిసిన తరువాత బలవంతంగా దరఖాస్తు చేయాలని చెప్పడం సరికాదన్నారు. వెంటనే సరప్లస్ జాబితా నుంచి వారిని తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం డీఈవో బాలాజీరావుకు సమస్యలను ఏకరువుపెట్టారు. వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని డీఈవో హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ అధ్యక్షుడు దశరథ రాములు, ప్రధాన కార్యదర్శి హజరత్, నాయకులు పాల్గొన్నారు.

దుకాణాల్లో రేషన్ పంపిణీతో ప్రజలకు మేలు

● మంత్రి నారాయణ



కార్డుదారులకు రేషన్ సరుకులు అందచేస్తున్న మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి

నెల్లూరు(హరనాథపురం), జూన్ 1(ఆంధ్రజ్యోతి) : చౌక దుకాణాల ద్వారా రేషన్ సరుకుల పంపిణీతో ప్రజలకు మేలు కలుగుతుందని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ అన్నారు. ఆదివారం నెల్లూరులోని జనార్దన్‌రెడ్డి కాలనీలో ఉన్న 102వ నంబరు రేషన్ షాపులో సరుకుల పంపిణీని, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. సరుకుల కోసం ఇక మీదట వేచి ఉండాల్సిన పనిలేదన్నారు. దుకాణాలకు వచ్చి ఎప్పుడైనా సరకులు తీసుకోవచ్చని చెప్పారు. వేమిరెడ్డి మాట్లాడుతూ దుకాణాల ద్వారా రేషన్ పంపిణీ విధానం ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

విజన్-2047 లక్ష్యంగా రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబు కృషి

● గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి



విలేకరులతో మాట్లాడుతున్న గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, పక్కన రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు తదితరులు

నెల్లూరు(హరనాథపురం), జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : విజన్-2047 లక్ష్యంగా రాష్ట్రాన్ని అన్నీ రంగాలలో అగ్రపథంలో నిలిపేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సరికొత్త ఆలోచనలతో ముందుకు సాగుతున్నారని రాష్ట్ర గృహనిర్మాణ, సమచారశాఖామంత్రి కొలుసు పార్థసారధి చెప్పారు. ఆదివారం నెల్లూరు నగరంలోని యాదవ భవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులు, యువత 2047 విజన్ లక్ష్యాలను అందుకునేందుకు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే రాష్ట్రానికి రూ.7లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. రాబోయే ఐదేళ్లలో సుమారు 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నదే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. సీఎం చంద్రబాబు క్వాంటమ్ వ్యాలీ టెక్నాలజీని దేశంలోనే తొలిసారిగా మన రాష్ట్రంలోనే ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. ఈ అడ్వాన్సుడు టెక్నాలజీతో లక్షలాది ఉద్యోగాలు వస్తాయని వివరించారు. నెల్లూరు జిల్లాను మరింత అభివృద్ధి చేసేందుకు జాతీయ రహదారులతో అనుసంధానం చేస్తున్నట్లు చెప్పారు. పీ-4 కార్యక్రమం ద్వారా రాష్ట్ర జీడీపీ బాగా పెరిగి అన్నీ రంగాలలో రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందని చెప్పారు.

● అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్

రాష్ట్రంలో అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులను అందిస్తామని మంత్రి చెప్పారు. ఇందుకోసం మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటైందని తెలిపారు. పూర్తిగా అధ్యయనం చేసిన తరువాత కేబినేట్‌లో చర్చించి వీలైనంత త్వరగా జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు అందచేస్తామని మంత్రి చెప్పారు. ఈ సమావేశంలో ఎంపీ బీద మస్తాన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ మోసం చేశాడని ఫిర్యాదు

సంగం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఓ కానిస్టేబుల్ తమను మోసం చేశాడంటూ మండలంలోని అన్నారెడ్డిపాళెం, బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన కొందరు ఆదివారం స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న కానిస్టేబుల్‌కు అన్నారెడ్డిపాళెంకి చెందిన ఓ మహిళ సమీప బంధువు. ఆమెకు బుచ్చికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి శ్రీనివాసులు ద్వారా కొద్ది రోజుల క్రితం రూ. 6 లక్షలు ఇప్పించాడు. ఆ మొత్తంతో తాకట్టులో ఉన్న ఆమె బంగారాన్ని విడిపించి తక్కువ వడ్డీకి మరో బ్యాంకులో తాకట్టు పెట్టి నగదును వెంటనే తిరిగి చెల్లిస్తామని నమ్మించాడు. కానీ, రోజులు గడుస్తున్నా శ్రీనివాసులుకు నగదు ఇవ్వకుండా కాలయాపన చేశారు. అంతేకాక ఆ మహిళపై అత్యాచారయత్నం చేసినట్లు ఆమెతో పోలీసులకు ఫిర్యాదు చేయించాడు. మరో నలుగురితో రూ.14లక్షలకుపైగా అప్పు ఇప్పించి మోసం చేశాడు. బాధితులంతా ఆదివారం ఎస్ఐ రాజేష్‌కు ఫిర్యాదు చేయగా, ఆయన విచారిస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	125
స్కిన్ చికెన్	224
స్కిన్‌లెస్	250

కోడిగుడ్ల ధర (100): 525

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9188
వెండి కిలో ధర	రూ. 99,600
వెండి ఒక గ్రాము	రూ.102.60

వైభవంగా అభయాంజనేయుడి పుష్కరిణి వార్షికోత్సవం

అల్లూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : అల్లూరు కోనేరు సెంటరులోని అభయాంజనేయస్వామి పుష్కరిణి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వాహకులు చేపట్టారు. ఇందులో భాగంగా ఆదివారం కోనేరు సెంటరు నుంచి ఇస్కపల్లి తూముల వరకు కాషాయం జెండాలు చేతబూని శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులు శ్రీరాముడు, సీతాదేవి, లక్ష్మణుడు, ఆంజనేయస్వామి వేషధారణతో ఆకట్టుకున్నారు.

సమైక్య ఉద్యమాలకు కార్మికులు సిద్ధం కావాలి : ఏఐటీయూసీ

కందుకూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): పాలకుల విధానాలపై కార్మికులు సమైక్య ఉద్యమాలు నిర్వహించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎస్కే జిలానీఖాన్ కోరారు. ఏఐటీయూసీ నియోజకవర్గ మహాసభ సీపీఐ కార్యాలయంలో ఆదివారం జరిగింది. ఈ మహాసభలో జిలానీఖాన్ మాట్లాడుతూ కార్మికుల చట్టాలను నరేంద్రమోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నదన్నారు. కే. మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో ఎస్టీయూ రాష్ట్ర మాజీ నాయకులు పీ మాలకొండయ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె. రమణమ్మ, పీ. బాలకోటయ్య, ఎస్కే హుస్సేన్, వై. ఆనంద్‌మోహన్, ఎన్. రామారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం 21మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా బీ సురేష్‌బాబు, అధ్యక్షుడిగా మురళీ కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా వై. ఆనంద్ మోహన్‌లను ఎన్నుకున్నారు.

పదో తరగతి విద్యార్థులకు నగదు బహుమతులు

గుడ్లూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల ప్రకటించిన పదవ తరగతి ఫలితాలలో మండలంలో 500 మార్కులకు పైగా సాధించిన, అన్ని పాఠశాలల విద్యార్థులకు గుడ్లూరు యశ్వంత్ సాయితేజ మోమోరియల్ ట్రస్ట్ ఆధ్వ ర్యలో నగదు బహుమతులు ఆదివారం అందజేశారు. స్థానిక అభ్యుదయ పాఠశాల ప్రాంగణంలో జరిగిన కార్యక్రమానికి అతిథులుగా సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ హాజరై మాట్లాడుతూ పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు ఇంటర్‌మీడియట్‌లో కూడా రాణించాలన్నారు.

జనసేన కార్యకర్తలకు కిట్ల పంపిణీ

అల్లూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఒక్కసీటు గెలవకపోయినా పదేళ్ల పార్టీని నడిపి నిలబెట్టిన నాయకుడు జన సేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అని ఆ పార్టీ కావలి ఇన్‌చార్జి అళహరి సుధాకర్ అన్నారు. అల్లూరులో ఆదివారం నిర్వహించిన క్రియాశీలక కార్యకర్తలకు కిట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా అల్లూరు ప్రధాన రహదారిలో బైక్ ర్యాలీ చేపట్టిన అనంతరం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం కార్యకర్తలు కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు కారుమంచి కార్తీక్ శర్మ, పబ్బా సాయి విఠల్, లక్ష్మీ, కోఆర్డినేటర్ బాలు, బెల్లంకొండ మస్తాన్, కావలి టౌన్ ఉపాధ్యక్షుడు నాగార్జున, బుర్రి మల్లికార్జున పాల్గొన్నారు.

షుగర్, బీపీ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఆత్మకూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు షుగర్, బీపీ, గుండె సంబంధిత వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యం వహిస్తే ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని ప్రముఖ వైద్యనిపుణులు ఎంవీ రమణయ్య, గుండె వ్యాధి నిపుణులు డాక్టర్ ఎం బాలకృష్ణ తెలిపారు. స్థానిక షిరిడి సాయిరామ్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం జన విజ్ఞాన వేదిక ఆత్మకూరు మండల శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రం వారి సహకారంతో వైద్య శిబిరం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రజలు ఆహార అలవాట్లు క్రమబద్ధీకరించుకుని, యోగా, వాకింగ్ తదితర వ్యాయా మాలు చేయడం దినచర్యలో భాగంగా అలవర్చుకోవాలన్నారు. అనంతరం రోగులను పరీక్షించి ఈసీజీ, రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ షేక్ సంధాని, జన విజ్ఞాన వేదిక నాయకులు ఎస్ మురళీకృష్ణ, కృష్ణమోహన్, హరికృష్ణ, పలువురు ఉపాధ్యాయులు, ఎల్ఆర్‌పల్లి పాఠశాల విద్యార్థులు పాల్గొని రోగులకు సేవలందించారు.

90శాతం రాయితీతో సంక్షేమ పథకాలు అందించాలి

మర్రిపాడు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : వడ్డెర కార్పొరేషన్ ద్వారా 90శాతం సబ్సిడీతో సంక్షేమ పథ కాలు అందించాలని ఆ సంఘం రాష్ట్ర కన్వీనర్ గంజి దయాకర్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో వడ్డెర సంగం మండల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వడ్డెర మహిళలపై, చిన్నారులపై వడ్డెర వృత్తిదారులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, తమకు అట్రాసిటీ ప్రత్యేక చట్టాన్ని ప్రభుత్వం కల్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు బీ.రత్నయ్య, వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పామూరురోడ్డు సబ్‌స్టేషన్ నుంచి శ్రీనగర్‌కాలనీకి వెళ్లే 11కేవీ ఫీడర్‌లో చెట్ల కొమ్మలు తొలగించడం కోసం సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఏఈ టీవీ నరసింహ తెలిపారు. ప్రజలు ఈ అసౌకర్యాన్ని గుర్తించి, అధికారులకు సహకరించాలని కోరారు.



అల్లూరు: రేషన్ సరుకుల పంపిణీని పునఃప్రారంభిస్తున్న బీద గిరిధర్, తహసీల్దారు లక్ష్మీ నారాయణ, తదితరులు



లింగసముద్రం: వీఆర్ కోటలో రేషన్ కార్డుదారులకు బియ్యం పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు



ఆత్మకూరులోని ఓ చౌకదుకాణం వద్ద రేషన్ అందజేస్తున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి తదితరులు

నాణ్యమైన నిత్యావసర సరుకుల పంపిణీయే లక్ష్యం

● ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి

కావలి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు నాణ్యమైన నిత్యావసర సరుకులు అందించాలనే ప్రభుత్వం రేషన్‌దుకాణాలను పునఃప్రారంభించినట్లు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక వైకుంఠపురంలోని 29వ రేషన్ దుకాణంలో లబ్ధిదారులకు రేషన్ సరుకుల పంపిణీని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మొబైల్‌వాహనాల ద్వారా రేషన్ సరుకులు పక్కదారి పట్టాయన్నారు. ప్రస్తుతం 15 రోజుల పాటు రేషన్ దుకాణాలు తెరిచి ఉంటాయని లబ్ధిదారులు ఎప్పుడైనా వెళ్లి సరుకులు తెచ్చుకోవచ్చన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే డీలర్లు సరుకులు అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పీ శ్రావణ్‌కుమార్, పౌరసరఫరాల ఉప తహసీల్దార్ విజయమ్మ, టీడీపీ నాయకులు మలిశెట్టి వెంకటేశ్వర్లు, పోతుగంటి అలేఖ్య, జ్యోతి బాబూరావు, మంచాల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అల్లూరు : స్థానిక 34, 5, 1, 2 నెంబర్ల రేషన్‌షాపుల్లో ఆదివారం చేపట్టిన సరుకుల పంపిణీ కార్యక్రమాలకు టీడీపీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు, సోమశిల కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీ పనులకు వెళ్లే పేదలు ప్రతీనెలా 15 లోపు రేషన్ సరుకులు పొందే అవకాశం ఉంటుందని, సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పలగాటి శ్రీనివాసులు రెడ్డి, బండి శ్రీనివాసులు రెడ్డి, కృష్ణచైతన్య, సామంతుల పరంధామి రెడ్డి, నజీర్ బాషా, మంగిశెట్టి సురేష్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొండాపురం : రేషన్ దుకాణాల వద్దనే సరుకులు పంపిణీ కార్యక్రమం ఆదివారం మండలంలోని అన్ని దుకాణాలలో ప్రారంభమైంది. మండల పరిధిలో 36 రేషన్ దుకాణాలలో సరుకుల పంపిణీ కార్యక్రమం జరిగినట్లు తహసీల్దార్ కోటేశ్వరరావు తెలిపారు. వికలాంగులు, వృద్ధులకు ఇంటివద్దకే సరుకులు అందచేయడం జరుగుతుందన్నారు. గుడవళ్లూరు షాపునెంబరు 2లో సరుకుల పంపిణీలో తహసీల్దార్ కోటేశ్వరరావు, భీమవరప్పాడు షాపునెంబరు 16లో టీడీపీ నాయకులు గురుదేవ్ శ్రీనివాస్,



కావలి: లబ్ధిదారుడికి బియ్యం అందచేస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి, పక్కన తహసీల్దార్ తదితరులు

గొట్టిపాటి మాలకొండయ్య, డీలర్ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

లింగసముద్రం, మండలంలోని 27 రేషన్ దుకాణాల ద్వారా ఆదివారం లబ్ధిదారులకు రెవెన్యూ అధికారులు డీలర్ల ద్వారా బియ్యం, కందిపప్పు, చక్కెర పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఎం రమణయ్య, వీఆర్ఓ పఠాన్ అమానుల్లాఖాన్, టీడీపీ నేతలు వంకాయలపాటి మాల్యాద్రి, బోయిళ్ల కొండపనాయుడు, పొంకం బ్రహ్మయ్య పాల్గొన్నారు.

ఆత్మకూరు: ఎన్డీఏ కూటమి ప్రభుత్వం నిర్ణయం మేరకు పండుగ వాతావర ణంలో ఆదివారం చౌకదుకాణాల్లో ప్రజలకు రేషన్ సరుకులు పంపిణీ చేశారు. పట్టణంలోని పలు చౌకదుకాణాలను టీడీపీ నేతలు, మున్సిపల్ కౌన్సిలర్లు పర్యవేక్షిస్తూ ప్రజలకు సక్రమంగా సరుకులు అందేలా దృష్టి సారించారు. ఈ సందర్భంగా టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి మాట్లాడుతూ వైసీపీ హయాంలో ప్రజా పంపిణీ వ్యవస్థ అస్తవ్య స్తంగా మారిందన్నారు. ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికి సరుకులు అందించడంలో విఫలమయ్యార న్నారు. రేషన్ బియ్యం పక్కదారి పట్టడానికి కూడా ఎండీయూ వాహనాలే ప్రధాన కారణమనే ఆరోపణలు ఉన్నాయన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మళ్లీ పాత విధానంలోనే డీలర్ల ద్వారా రేషన్ సరుకులు పంపిణీ చేయడంపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్య క్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సర్దార్, తెలుగు యువత జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి తోడేటి వెంకటయ్య, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చేజర్ల: కూటమి ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ప్రక్షాళనలో భాగంగా లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా పాత విధానంలోనే ఆదివారం రేషన్ దుకాణాల ద్వారా రేషన్ పంపిణీ చేపట్టారు. గతంలో రేషన్ బండి ఎప్పుడు వస్తుందో తెలియదు, ఒక వేళ వచ్చినా ఎక్కడో సందు చివరన పెడితే అక్కడకు వెళ్లి సరుకులు తీసుకోవాలి. ఒక వేళ బండి వచ్చే సమయంలో బయటకు వెళ్లి ఉంటే ఇక సరుకులు లేనట్లే. ఈ నేపథ్యంలో ఆదివారం నుంచి రేషన్ దుకాణాల సరుకులు పంపిణీ చేయడంతో పాటు, సమయాలు కూడా ఏర్పాటు చేయడంతో కార్డుదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో మొత్తం 36 రేషన్ షాపుల ద్వారా సరుకులు పంపిణీ ప్రారంభించినట్లు సివిల్‌సప్లైస్ డీటీ రవి తెలిపారు.

సంగం: మండలంలోని అన్ని రేషన్ దుకాణాల్లో డీలర్లు లబ్ధిదారులకు నిత్యవసర సరుకులు ఆదివారం పంపిణీ చేశారు. సంగం 2వ నెంబరు దుకాణంలో సోమ్లా నాయక్, టీడీపీ నాయకులు పంపిణీ చేశారు. అదేవిధంగా దివ్యాంగుల ఇంటికి టీడీపీ నాయకులు సరుకులు తీసుకెళ్లి అందచేశారు.

బిట్రగుంట, (దగదర్తి): దగదర్తి మండలం కౌరుగుంటంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు అంబటి రమేష్ అధ్వ ర్యంలో ఆదివారం రేషన్‌షాపులో సరుకుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వెంకట క్రిష్ణారెడ్డి హాజరై లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు కృష్ణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి, ఆర్ఐ శివ, పార్టీ మండల కన్వీనర్ హనుమంత రావు, తదితరులు ఉన్నారు.

బిట్రగుంట : బోగోలు మండలం విశ్వనాథరావుపేటలోని రేషన్ షాపులో మండల తహసీల్దారు సురేష్‌బాబు ఆదివారం సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ నాగేశ్వరరావు, నేతలు సుధీర్‌బాబు, అడపా ప్రసాద్ తదితరులు ఉన్నారు.



కొండాపురం: భీమవరప్పాడులో రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న డీలర్ సంధ్య తదితరులు



ఉలవపాడు రేషన్ షాపులో రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

ఉలవపాడు : మండలంలోని ఉలవపాడులోని రేషన్ షాపు నెం. 2 వద్ద లబ్ధిదారులకు తహసీల్దార్ టీ శ్రీనివాసులు బియ్యం, ఇరత సరుకులు పంపిణీ చేశారు. అనంతరం మండలంలోని రేషన్ షాపుల పనితీరును పర్యవేక్షించారు.

వైద్యఖర్చులకు ఆర్థికసాయం

ఉదయగిరి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న మహానాడుకు వెళ్లి తిరిగి స్వగ్రామమైన ఉదయగిరికి వస్తూ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి తిరుపతి కిమ్స్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఫస్ట్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పీవీ రమణయ్యకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు ఆది వారం టీడీపీ నాయకులు ఆర్థికసాయం అంద జేశారు. ఈ సందర్భంగా వారు వైద్యశాలకు వెళ్లి ఆయన్ను పరామర్శించి త్వరగా కోలుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, టీడీపీ నాయకులు బొజ్జా నరసింహులు, ఉప్పుటూరి వెంకటయ్య, రోశయ్య, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం: ఉదయగిరి పట్టణం ఇందిరానగర్‌కాలనీలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన గాలేటి నవ్య కుటుంబానికి కూడా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు టీడీపీ నాయకులు ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. మృతురాలి కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే ఫోన్ చేసి పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నల్లిపోగు రాజా, నరసింహా, మట్ల లక్ష్మయ్య, రామయ్య, తుమ్మల కిరణ్ పాల్గొన్నారు.

పొలం యజమాని దారుణ హత్య

లింగసముద్రం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తన స్వంత నిమ్మ తోటలో పనిచేయించుకునేందుకు తీసుకెళ్లిన ఓ వ్యక్తి చేతిలో పొలం యజమాని దారుణ హత్యకు గురైన సంఘటన మండలంలోని ఆర్ఆర్ పాలెంలో జరిగింది. గ్రామస్థులు అందించిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. లింగసముద్రం పంచాయతీలోని జంపాలవారిపాలెంకు చెందిన తేపూరి నరసింహం (67) శుక్రవా రం ఉదయం 10 గంటలకు ఆర్ఆర్ పాలెం సమీపంలోని తన నిమ్మతోటలో పనిచేయించుకునేందుకు పొన్నలూరు మండలంలోని రావులకొల్లు గ్రామానికి చెందిన చలంచర్ల బ్రహ్మయ్య అనే వ్యక్తిని తోట వద్దకు తీసుకెళ్లాడు. అయితే అక్కడకు వెళ్లిన తరువాత ఇద్దరూ కలిసి మద్యం సేవించారు. అనంతరం ఏమి జరిగిందో ఏమో నరసింహంను బ్రహ్మయ్య కత్తితో తల వెనుక భాగంలో నరికాడు. దీంతో నరసింహం చనిపోయాడు. దీంతో బ్రహ్మయ్య నరసింహం మృతదేహాన్ని బోరు వద్ద ఉన్న పట్టలో కప్పి కందుకూరు వెళ్లిపోయాడు. అయితే కందుకూరులో బ్రహ్మయ్య మద్యం సేవించి అదేరోజు రాత్రి 8గంటలకు నిమ్మతోట వద్దకు వెళ్లి నరసింహం మృతదేహాన్ని కత్తితో ముక్కలు ముక్కలుగా నరికి బోరులో వేసి ఇంటికి వెళ్లిపోయాడు. కాగా, నిమ్మతోటకి వెళ్లిన తండ్రి నరసింహం మధ్యాహ్నం భోజనానికి ఇంటికి రాకపోవడంతో కుమారుడు రమేష్, బంధువులు తోట వద్దకు వెళ్లి చూడగా కనిపించలేదు. దీంతో వారు బ్రహ్మయ్యను నిలదీయగా, తనకు తెలియదని బుకాయించాడు. అయితే అనుమానం వచ్చిన రమేష్ బ్రహ్మయ్యను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి పోలీసులకు అప్పగించి శనివారం ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసుల విచారణలో నిందితుడు బ్రహ్మయ్య చెప్పిన వివరాల మేరకు ఆదివారం కందుకూరు డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, గుడ్లూరు సీఐ మంగారావు, స్థానిక ఎస్సై ఎం నారాయణలు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అయితే పోలీసులు నరసింహం శరీర భాగాలను సేకరించేందుకు బోరును తవ్వించాలని ఎక్స్‌కవేటర్‌ను రప్పించారు. పోలీసు జాగిలం అక్కడ పరిసర ప్రాంతాలను పరిశీలించింది. అయితే బ్రహ్మయ్య నరసింహంను చంపడానికి గల కారణాలు తెలియరాలేదు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం నారాయణ తెలిపారు.



మృతుడు నరసింహం బంధువులను విచారిస్తున్న కందుకూరు డీఎస్పీ బాల సుబ్రహ్మణ్యం

వరికుంటపాడు ఎంపీడీవోగా నాగూర్‌వలి

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండల అభివృద్ధి అధికారిగా, ప్రస్తుతం కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవోగా విధులు నిర్వర్తిస్తున్న నాగూర్‌వలికి బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు అందాయి. గతంలో ఇన్‌చార్జీ ఎంపీడీవోగా విధులు నిర్వర్తిస్తున్న ఏవో వేణుగోపాలరావు పదవి విరమణ చేయడంతో ఆయన స్థానంలో నాగూర్‌వలికి బాధ్యతలు అప్పగించారు. సుమారు రెండేళ్లుగా రెగ్యులర్ ఎంపీడీవోను నియమించకపోవడంతో ఇన్‌చార్జీల పాలనే కొనసాగుతోంది.

లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా రేషన్ పంపిణీ

● ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా రేషన్ పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ హాస్పటల్ వెనుక రేషన్ దుకాణాన్ని సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్డుదారులకు రేషన్ పంపిణీ చేయటంతో పాటు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిసరాల్లో వయోవృద్ధులు, వికలాంగులకు వారి ఇళ్లవద్దకే వెళ్లి రేషన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు దుకాణాలలో డీలర్లు అందుబాటులో ఉండి సరుకులు ఇస్తారన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి, సబ్ కలెక్టరు శ్రీపూజలను స్థానిక నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో తహసిల్దార్ లావణ్య, డీటీ కాటా చెంచురామయ్య, పార్టీ నాయకులు ఉప్పుటూరి శ్రీనివాసరావు, దామా మల్లేశ్వరరావు, పిడికిటి వెంకటేశ్వర్లు, చదలవాడ కొండయ్య, చిలకపాటి మధు, రఫీ, బెజవాడ ప్రసాదు, వడ్డెళ్ల రవిచంద్ర, తదితరులు పాల్గొన్నారు.



కార్డుదారులకు బియ్యం అందజేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, సబ్ కలెక్టరు శ్రీపూజ తదితరులు

అంకమ్మ ఆలయ పునర్నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

కందుకూరు గ్రామదేవత అంకమ్మ దేవాలయంలో జరుగుతున్న అనివేటి మండపం నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచించారు. ఆదివారం ఉదయం ఆయన అంకమ్మ దేవాలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అనివేటి మండప పునర్నిర్మాణం కోసం రూపుదిద్దుకుంటున్న యాలీస్తంభాలను పరిశీలించి శిల్పితో మాట్లాడారు. పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో నిర్మించనున్న షాపింగ్ కాంప్లెక్స్ ప్రాంతాన్ని కూడా పరిశీలించి పనులు వేగవంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఈఓ కార్తీక్‌కు సూచించారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ డీఈ శ్రీనివాసరావు, దామా మల్లేశ్వరరావు, పిడికిటి వెంకటేశ్వర్లు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, కొడాలి కోటేశ్వరరావు, చిలకపాటి మధు, రావూరి రామకోటయ్య, చక్కా కేశవ తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించి పసుపు రైతులను ఆదుకోండి

ఉదయగిరి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ప్రభు త్వం పసుపు పంటకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని సీపీఎం రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కాకు వెంకటయ్య డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని కృష్ణారెడ్డిపల్లి, కొత్తపల్లి, లింగంనేనిపల్లి తదితర గ్రామాల్లో కల్లాల్లో ఉన్న పసుపు పంటను పరిశీలించి రైతులతో చర్చించారు. ఆయన మాట్లా డుతూ రేయింబవళ్లు కష్టించి సాగు చేసిన పసుపు పంటకు గిట్టుబాటు ధర లేకపోవ డంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. పసుపు పంట కోతల సమయంలో క్వింటా రూ.12 నుంచి రూ.13 వేలు ఉండగా, ప్రస్తుతం రూ.9 వేలకు దిగజారిందన్నారు. ఎకరా పసుపు పంటకు రూ.2 లక్షల పెట్టుబడి అవుతుందని, ఈ ధరతో రైతులకు పెట్టుబడులు కూడా రావన్నారు. గత ప్రభుత్వంలో క్వింటా రూ.16 వేలు పలికిందన్నారు. రైతు సంక్షేమమే మా ప్రభుత్వ సంక్షేమమని చెప్పిన కూటమి ప్రభు త్వంలో ధరలు దిగజారడం దారుణమన్నారు. ప్రభుత్వం స్పందించి పసుపు పంటను మద్దతు ధరతో కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని, లేదంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.



కల్లాల్లో ఉన్న పసుపు కుప్పలను పరిశీలిస్తున్న వెంకటయ్య

ఆగ్రో ఇండస్ట్రీస్‌ను అభివృద్ధి పథంలో నడిపించాలి

● ఎమ్మెల్సీ బీద రవిచంద్ర

బిట్రగుంట, (దగదర్తి) జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఆగ్రో ఇండస్ట్రీస్‌ను అభివృద్ధి పథంలో నడిపించాలని ఎంఎల్సీ బీద రవిచంద్ర మాలేపాటిని కోరారు. దగదర్తి మండల టీడీపీ నేత, ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు ఆదివారం రవిచంద్రను నెల్లూరులోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసారు. అనంతరం పార్టీకి సంబంధించిన విషయాలను ముచ్చటించుకున్నారు.

మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

కావలి రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి అన్నారు. కావలి మండలం అన్నగారిపాలెం పంచాయతీ వెంకటేశ్వరపురం రాములవారి తిరునాళ్లలో శనివారం రాత్రి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆలయం వద్ద నిర్వహించిన పూజల్లో ఎమ్మెల్యే పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు, భక్తులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంను నియమించి పాఠశాలను కాపాడండి

ఉదయగిరి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడిని నియమించి పాఠశాలను కాపాడాలని ఉదయగిరి, సీతారామపురం యూటీఎఫ్ మండల శాఖలు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నాయి. రెండేళ్ల క్రితం 700 మంది విద్యార్థులతో కళకళలాడుతున్న పాఠశాల ప్రస్తుతం ఉపాధ్యాయుల కొరత, వసతుల లేమితో మూతపడే స్థాయికి దిగజారిందన్నారు. నూతన భవనాలు నిర్మించినప్పటికీ వాటిని వినియోగంలోకి రాక, విద్యార్థులకు తరగతి గదుల్లేక ఆరుబయట చెట్లకింద విద్యాబోధన చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. దీంతో పాటు విద్యార్థులకు మరుగుదొడ్లు, నీటి వసతి లేక, ఉపాధ్యాయుల్లేక ఏడాదికేడాది విద్యార్థుల సంఖ్య తగ్గుతోందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడిని నియమించి వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

భక్తిశ్రద్ధలతో నాగారపమ్మకు పూజలు

సంగం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్లలో వెలసి ఉన్న నాగారపమ్మ దేవి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పూలతో అలంకరించారు. తరువాత భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

గుండె పోటుకు గురైన వ్యక్తిని కాపాడిన సీఐ

కావలి రూరల్, జూన్1 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణ ముసునూరు ఇందిరమ్మ కాలనీకి చెందిన చంద్రశేఖర్ మోటార్‌సైకిల్‌పై వెళ్తూ ఆదివారం సాయంత్రం గుండెపోటుకు గురై ట్రంక్ రోడ్డు లోని లేక్ వ్యూ హోటల్ సమీపంలో కుప్పకూలిపోయాడు. విధుల నిమిత్తం అటుగా వెళ్తున్న 1వ పట్టణ సిఐ ఫిరోజ్ గుర్తించి ప్రాణాపాయ స్థితిలో ఉన్న చంద్రశేఖర్‌కు సిపీఆర్ చేసి తన డ్రైవర్ శివ, స్థానికుల సహకారంతో ఆటోలో ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. అతని ఆరోగ్యం కుదుట పడటంతో సకాలంలో స్పందించి ప్రాణాలు కాపాడిన సిఐ ఫిరోజ్‌కు చంద్రశేఖర్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రధానోపాధ్యాయుడు బాధ్యతల స్వీకరణ

సీతారామపురం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) :ఇందుకూరు పేట నుంచి ప్రమోషన్ ద్వారా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా ప్రవీణ , దర్గామిట్ట నెల్లూరు నుంచి ఓగురువారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా గిరి ప్రసాద్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బీసీ వెంగయ్య, సిగే కొండయ్య, విజయబాబు, వెంకటేశ్వర్లు ,ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దుత్తలూరు(ఉదయగిరి), (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుత్తలూరు, నందిపాడు, ఏరుకొల్లు, నర్రవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులుగా కె.రమణమ్మ, దేవకుమార్, మాధవి, అంజయ్య ఆదివారం బాధ్యతలు స్వీకరించారు.

యోగాంధ్రపై అవగాహన

అనంతసాగరం జూన్ 1 (ఆంధ్ర జ్యోతి): స్థానికశాఖ గ్రంథాలయంలో ఆది వారం వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా యోగాంధ్ర కార్యక్రమంపై గ్రంథపాలకుడు నారాయణ రావు అవగాహన కల్పించారు. విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

నేకునాంపేట హెచ్‌ఎంగా రమణ

కొండాపురం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేకునాంపేట జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా వివి రమణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పాఠశాలలోని ఉపాధ్యాయులు ఆయనను సన్మానించారు.



భోగ శ్రీనివాసమూర్తికి సహస్ర కలశాభిషేకం

శ్రీవారి పంచ బేరాలలో ఒకటైన భోగ శ్రీనివాసమూర్తిని తిరుమల శ్రీవారి ఆలయంలో పల్లవరాణి సామవై ప్రతిష్ఠించిన దినాన్ని పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక సహస్రకలశాభిషేకాన్ని నిర్వహించారు. ఉదయం 6 నుంచి 8.30 గంటల వరకు శ్రీవారి ఆలయంలోని గరుడాళ్వార్ సన్నిధిలో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి, భోగశ్రీనివాసమూర్తి, విష్వక్సేనుడిని వేంచేపు చేశారు. శ్రీవారి మూలమూర్తి ముందున్న గరుడాళ్వార్ సన్నిధిలో భోగశ్రీనివాసమూర్తిని, ఆయనకు అభిముఖంగా విష్వక్సేనుడిని ఆశీనులు చేశారు. తర్వాత శ్రీవారి మూలమూర్తిని భోగశ్రీనివాసమూర్తికి కలుపుతూ దారం కట్టి అనుసంధానం చేశారు. భోగశ్రీనివాసమూర్తికి నిర్వహించే భిషేకాది క్రతువులు మూలమూర్తికి నిర్వహించినట్లు అవుతుంది. అనంతరం వేదపండితులు వేద పారాయణం చేయగా, అర్చకస్వాములు ఏకాంతంగా ప్రత్యేక సహస్రకలశాభిషేకం నిర్వహించారు. కాగా, పల్లవరాణి సామవై పెరుందేవి క్రీ.శ 614లో జ్యేష్ఠ మాసంలో 18 అంగుళాల పొడవు కలిగిన వెండి భోగశ్రీనివాసమూర్తి విగ్రహాన్ని శ్రీవారి ఆలయానికి కానుకగా ఇచ్చారు. విమాన వేంకటేశ్వరుని విగ్రహం కింద భాగంలోని గోడపై ఈ శాసనం కనిపిస్తుంది. ఈ కలశాభిషేకంలో జీయర్ స్వాములు, చైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు తదితరులు పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



ఆరుద్ర పురుగులొచ్చాయ్

ఎర్రావారిపాలె మండలంలో దుక్కి చేసిన పొల్లాలోకి ఆరుద్ర పురుగులొచ్చాయ్. అంటే.. ఖరీఫ్ పంటసాగుకు అదును ప్రారంభమైందని ప్రకృతి సూచనగా రైతులు భావిస్తారు. ఏటా జూన్ నెల ప్రారంభం కాగానే ఆరుద్ర పురుగులు పొలాల్లో దర్శనమిస్తాయి. ఆరుద్ర కార్తె ప్రారంభానికి ఈ పురుగులు పొలాల్లో కనపడటం వల్ల ఆరుద్ర పురుగులుగా పిలుస్తారు. ఎర్రగా మెరుస్తూ, పొలాల్లో చకచకా నడుసస్తూ, ముట్టుకొంటే మృదువుగా ఉండే ఈ పురుగులు రైతులకు కనువిందు చేస్తాయి. పొల్లాలో ఆరుద్ర పురుగులు కనపడడం శుభసూచకంగా రైతులు భావిస్తారు. వర్షాలు భాగా కురస్తాయని వీరి నమ్మకం.

- ఎర్రావారిపాలెం, ఆంధ్రజ్యోతి

మేలైన మార్పులు.. జాతీయ ప్రమాణాలు

ఇంటర్ విద్యలో సంస్కరణలు



చంద్రగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల

- ఎయిడెడ్ కళాశాల: 1
- ప్రభుత్వ కళాశాలలు: 21
- ఇతర ప్రభుత్వ యాజమాన్యం: 163
- రెండో సంవత్సర విద్యార్థులు: 30,359

- నేటి నుంచి జూనియర్ కళాశాలలు పునః ప్రారంభం
- ఫస్టియర్ విద్యార్థులకు ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్

కీలక సంస్కరణలు.. జాతీయ ప్రమాణాలతో ఈ విద్యాసంవత్సరంలో ఇంటర్ విద్య మొదలు కానుంది. వైసీపీ హయాంలో బాలికలకు జూనియర్ కళాశాలలు, హైస్కూల్ ప్లస్ ప్రవేశ పెట్టినా.. విద్యాపరంగా గాలికొదిలేశారు. కూటమి అధికారంలోకి వచ్చాక విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్.. విద్యారంగం అభివృద్ధికి వినూత్న మార్పులు తీసుకొచ్చారు. సోమవారం నుంచి జూనియర్ కళాశాలలు పునఃప్రారంభమవుతున్నాయి.

- తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి

జాతీయ విద్యా విధానం-2020లో భాగంగా 2025-26 విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ విద్యలో ఎన్‌సీఈఆర్టీ సిలబస్, సీబీఎస్ఈ విధానాలు అమలు చేయనున్నారు. విద్యార్థులకు సబ్జెక్టుల ఎంపికలో సౌలభ్యాన్ని పెంచుతూ ఎలక్టివ్ విధానాన్ని ప్రవేశ పెట్టారు. ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లో మ్యాథ్స్- ఏ, బీ రెండింటినీ ఒకే సబ్జెక్టుగా.. బోటనీ, జువాలజీ సబ్జెక్టులను కలిసి బయాలజీగా రూపొందించారు. పార్టు-1 సబ్జెక్టు కింద ఆంగ్లం మాత్రమే ఉంటుంది. పార్టు-2 కింద జాతీయ భాషలతోపాటు మరికొన్ని సబ్జెక్టులుంటాయి. విద్యార్థి తన అభీష్టం మేరకు ఏదైనా ఎంపిక చేసుకునే వెసులుబాటు ఉంది. పార్టు-2లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఎంఈసీ గ్రూపు సబ్జెక్టులు ఉంటాయి. నూతన విధానంలో ఎంపీసీ విద్యార్థి అదనపు సబ్జెక్టుగా బయాలజీని, బైపీసీ వారు గణితాన్ని ఎంచుకోవచ్చు. పార్టు 1,2,3 సబ్జెక్టుల్లో వచ్చిన మార్కులనే పరిగణిస్తారు. ప్రశ్నపత్రాల్లోనూ మార్పులు తీసుకురానున్నారు. సైన్స్ సబ్జెక్టుల్లో 80 మార్కులకు, ఇతర అంశాల్లో వంద మార్కులకు పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రాక్టికల్స్ 20 మార్కులు ఉంటాయి.

మారిన క్యాలెండర్ : ఇంటర్ విద్యా క్యాలెండర్‌లో ఈ విద్యా సంవత్సరం నుంచి మార్పులు చేశారు. ఇంతకు ముందు పరీక్షలు అయిపోగానే వేసవి సెలవులు ఇచ్చేవారు. ఇప్పుడేమో పరీక్షల తర్వాత ఏప్రిల్ 1 నుంచే ప్రభుత్వ కళాశాలలు ప్రారంభించి 23వ తేదీ వరకు సెకండియర్ తరగతులు నిర్వహిస్తారు. ఏప్రిల్ 24 నుంచి మే 31 వరకు వేసవి సెలవులు ఇచ్చేలా నిర్ణయించారు. అలా.. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి 23వ తేదీ వరకు తరగతులు నిర్వహించిన నేపథ్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 15 శాతం సిలబస్ పూర్తయింది.

పోటీ పరీక్షలకు సన్నద్ధం

ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు జేఈఈ, నీట్ వంటి జాతీయస్థాయి పరీక్షలకు శిక్షణ ఇవ్వనున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అకడమిక్ తరగతులు నిర్వహిస్తారు. ఆ తర్వాత రెండు గంటలపాటు (సాయంత్రం 5 గంటల వరకు) జేఈఈ, ఎంసెట్, నీట్‌కు శిక్షణ ఇస్తారు. దీనికి ప్రత్యేక మెటీరియల్ సిద్ధం చేశారు. అవసరమైతే ప్రత్యేక నిపుణులతో శిక్షణ ఇప్పించేలా నిర్ణయించారు.

కొత్తగా ఎంబైపీసీ

ఈ విద్యా సంవత్సరం నుంచి ఎంబైపీసీ గ్రూపు అందుబాటులోకి రానుంది. 6 సబ్జెక్టులతో ఎంబైపీసీ చదవచ్చు. ఇందులో ఇంగ్లిష్ తప్పనిసరి. సెంకడ్ లాగ్వేజీ ఆప్షనల్‌గా ఎంచుకోవచ్చు. గణితం, బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులు ఉంటాయి. ఎంపీసీ విద్యార్థులు సెకండ్ లాంగ్వేజ్‌గా హిందీ, సంస్కృతం, ఉర్దూ కాకుండా బయాలజీ తీసుకుని ఎంబైపీసీ చదవవచ్చు. బైపీసీ విద్యార్థులు గణితంను తీసుకుని ఎంబైపీసీ గ్రూపు చదవవచ్చు. ఎంబైపీసీ తీసుకున్న విద్యార్థులకు మెడిసిన్, ఇంజినీరింగ్ కోర్సులకు ప్రవేశ పరీక్షలు రాసే అవకాశం ఉంటుంది.

ఇప్పటికే పుస్తకాలూ పంపిణీ

గత వైసీపీ ప్రభుత్వంలో విద్యా సంవత్సరం సగం పూర్తయినా పుస్తకాలు పంపిణీకాని పరిస్థితులు నెలకొన్నాయి.ఈ ప్రభుత్వంలో ఇప్పటికే ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ప్రస్తుతం ప్రథమ సంవత్సరం ప్రవేశాలు జరుగుతున్నందున తరగతులు ప్రారంభమైన వెంటనే పుస్తకాలు, నోట్‌బుక్స్ అందించేలా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే పుస్తకాలు ఆయా కళాశాలలకు చేరాయి. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కొనసాగించనున్నారు.

హైస్కూల్ ప్లస్‌పై మల్లగుల్లాలు

ఇంటర్ విద్యలో ఇన్ని సంస్కరణలు తీసుకొచ్చిన ప్రభుత్వం హైస్కూల్ ప్లస్‌లను ఎలా అభివృద్ధి చేయాలని మల్లగుల్లాలు పడుతున్నట్టు తెలుస్తోంది. హైస్కూల్ ప్లస్‌లను ప్రారంభించిన గత వైసీపీ ప్రభుత్వం.. అవసరమైన బోధనా సిబ్బంది, వసతులు కల్పించలేదు. దీంతో రాష్ట్రంలో అతితక్కువ ఉత్తీర్ణతా శాతాన్ని నమోదు చేస్తున్న విద్యాసంస్థలుగా ఇవి నిలిచాయి. జిల్లాలో మొత్తం 29 హైస్కూల్ ప్లస్‌లు ఉండగా ఏకంగా పదింటిలో విద్యార్థులు లేకపోవడం గమనార్హం. ఈ విద్యాసంస్థలనూ గాడినపెట్టి ఉత్తీర్ణతా శాతాన్ని పెంచేందుకు మంత్రి లోకేశ్ కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఐతే కొంతమంది విద్యావేత్తలు హైస్కూల్ ప్లస్‌లను రద్దు చేయాలని సూచిస్తున్నట్టు సమాచారం.

ప్రభుత్వ కళాశాలల్లో చేరండి

జిల్లాలో ఇంటర్ విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లో చేరాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖాధికారి జి. రాజశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. జూనియర్ కళాశాలల పునఃప్రారంభం నేపథ్యంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలల్లో నిష్ణాతులైన బోధకులున్నారని, కార్పొరేట్ కళాశాలలకు దీటుగా బోధన ఉంటుందన్నారు. ఈ ఏడాది పరీక్షల్లో ప్రభుత్వ విద్యార్థులు సాధించిన ఫలితాలే ఇందుకు నిదర్శనమన్నారు. ప్రైవేటుతో పోలిస్తే మెరుగైన వసతులు, క్రీడా మైదానాలు ఉంటాయన్నారు. ఇంటర్ విద్యను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అనేక సంస్కరణలు తీసుకొచ్చిన క్రమంలో పెద్దలు తమ పిల్లలను ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించాలని కోరారు.





రేషన్ దుకాణాల నుంచే సరుకులు

జిల్లా అంతటా పండుగ వాతావరణంలో ప్రారంభోత్సవాలు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రేషన్ షాపులను పూలతో అలంకరించారు. మామిడి మండలూ కట్టారు. పండుగ వాతావరణంలో రేషన్ షాపుల ద్వారా సరుకుల పంపిణీని ఆదివారం ప్రారంభించారు. ప్రభుత్వం ఎండీయూ వాహనాలను రద్దు చేసి, చౌకదుకాణాల్లోనే సరుకుల పంపిణీకి ఈనెల నుంచి చర్యలు తీసుకుంది. తొలిరోజు 16 శాతం మంది సరుకులు తీసుకున్నట్లు సమాచారం. పలు రేషన్ షాపుల్లో సర్వర్ సమస్య తలెత్తడంతో సరుకుల పంపిణీలో జాప్యం జరిగింది. గూడూరులో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, సత్యవేడు నియోజకవర్గంలోని దాసుకుప్పం, రామగిరిలో ఎమ్మెల్యే ఆదిమూలం రేషన్ షాపుల్లో సరుకుల పంపిణీని ప్రారంభించారు. ఇక, తిరుపతి నగరం పెద్దకాపులే అవుట్‌లోని షాపు నెంబరు 32, సత్యనారాయణపురంలోని 74, 75 రేషన్ షాపులలో కార్డుదారులకు సరుకులను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చేతుల మీదుగా పంపిణీ చేశారు. వైసీపీ ప్రభుత్వంలో కార్డుదారులను నానా ఇబ్బందులు పెట్టారని, రేషన్ బండి ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి నెలకొందని ఆరణి అన్నారు. ఎండీయూ వాహన వ్యవస్థలో ఎదురైన సమస్యలను ప్రభుత్వం సమీక్షించి.. ప్రజలకు ప్రయోజనం కలిగించేలా రేషన్ షాపుల నుంచే నేరుగా పంపిణీ చేయాలని నిర్ణయం తీసుకుందన్నారు. బయట పనులకు వెళ్లేవారికి ఇది సౌలభ్యంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. కార్డుదారులకు సమస్యలుంటే బోర్డులో రాసిన నెంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు ఆర్డీవో రామ్మోహన్‌రావు, డీఎస్‌వో శేషాచలం రాజు, డీటీ సురేంద్ర, అర్బన్ తహసిల్దార్ భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్ మునికృష్ణ, కార్పొరేటర్లు, కూటమి నేతలు ఎస్కే బాబు, అన్నా అనిత, పులుగోరు మురళి, సింగంశెట్టి సుబ్బరామయ్య, శ్రీనివాసులు రెడ్డి, రామకృష్ణారెడ్డి, రాజారెడ్డి, ఆకేపాటి సుభాషిణి, మహేష్ యాదవ్, భరణి యాదవ్, హేమంత్‌కుమార్, దూది శివ, బాలాజీ, శ్రీనివాస్, ఆళ్వార్ మురళి, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

కచ్చితమైన తూకం పాటించాలి

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 1(ఆంధ్రజ్యోతి): కార్డు దారులకు కచ్చితమైన తూకంతో నాణ్యమైన సరుకులు అందించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. తిరుచానూరు పంచాయతీ యోగిమల్లవరంలో కార్డుదారులకు డీఎస్వో శేషాచలంరాజుతో కలిసి ఆదివారం ఆయన సరుకులను పంపిణీ చేశారు. 65 సంవత్సరాలు దాటిన వారికి ఇళ్ల వద్దకే నిత్యావసర సరుకులను అందజేశారు. ఏఎస్వో జయరాజ్, తహసీల్దారు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



యోగిమల్లవరం మిట్టవీధిలో వృద్ధులకు సరుకులు అందిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్





బయోమెట్రిక్‌లో వేలి ముద్ర తీసుకుని అభ్యర్థులను అనుమతిస్తున్న సిబ్బంది - పరీక్షా కేంద్రాల వద్ద బయోమెట్రిక్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఎస్పీ

ప్రశాంతంగా పోలీసు రాత పరీక్షలు

- 5049 మంది హాజరు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని తొమ్మిది కేంద్రాల్లో ఆదివారం పోలీసు ఎంపిక రాత పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. మొత్తం 5049 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. బయోమెట్రిక్‌లో అభ్యర్థుల వేలి ముద్రలను తీసుకుని.. మెటల్ డిటెక్టర్లతో తనిఖీ చేసి లోపలకు అనుమతించారు. ప్రతి అభ్యర్థి ఎలక్ట్రానిక్ వస్తువులను బయట పెట్టి వెళ్ళాలని విజ్ఞప్తి చేశారు. డీఎస్పీ భక్తవత్సలం తదితర అధికారులతో కలిసి ఎస్పీ హర్షవర్ధనరాజు తిరుపతిలోని పద్మావతి విశ్వవిద్యాలయం, మహిళా డిగ్రీ కళాశాల, అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలోని పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. కొందరు అభ్యర్థులతో మాట్లాడి ఆల్ ది బెస్ట్ చెప్పారు.

ప్రైవేటు ట్రావెల్స్‌పై రవాణా శాఖ కొరడా

తిరుపతి(జీవకోన), జూన్1(ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి దూర ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై శనివారం అర్ధరాత్రి ఆర్టీవో మురళీమోహన్ పర్యవేక్షణలో అధికారులు కొరడా ఝుళిపించారు. ఫిట్‌నెస్ లోపం, పన్నులు చెల్లించని, ఇతర అనుమతులు లేని కారణంగా 25 బస్సులపై కేసులు నమోదు చేశారు. రూ.10లక్షల వరకు అపరాధ రుసుం వసూలు చేశారు. ధ్రువపత్రాల్లేని బస్సులను స్వాధీనం చేసుకుని.. ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. ఈ తనిఖీల్లో ఎంవీఐలు వెంకటసుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, అతికానాజ్, చంద్రశేఖర్ ఉన్నారు. సూళ్లూరుపేట, గూడూరు ఎంవీఐలు సునీల్‌రెడ్డి, ప్రభాకర్, శాంతి, అనిల్‌కుమార్ ఆయా ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు.

శివ..శివా!

- అవినీతి అధికారికి అందలమా?

తిరుపతి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ సర్కారులో తీవ్ర ఆరోపణలతో సస్పెండైన అధికారులను ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో అందలం ఎక్కించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. తిరుపతి అర్బన్ తహసీల్దార్‌గా గత ప్రభుత్వంలో అవినీతి ఆరోపణలతో రేణిగుంట తహసీల్దార్‌గా పనిచేస్తూ ఏడాది క్రితం (8-4-2024) సస్పెండైన అధికారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సీసీఎల్ఏ ప్రత్యేక కార్యదర్శి గత నెల 18న ఉత్తర్వులు జారీచేశారు. సస్పెండైన ప్రభుత్వ ఉద్యోగికి ఏడాది తర్వాత పోస్టింగ్ ఇవ్వాలన్న నిబంధన ఉంది. ఆమేరకు ఆయన సస్పెన్షన్‌ను రీవోక్ చేస్తూ పోస్టింగ్ ఇవ్వాలని కలెక్టర్‌కు ఆదేశాలు వచ్చాయి. దీంతో తిరుపతి అర్బన్ తహసీల్దార్‌గా కూర్చోనేందుకు సదరు అధికారి సర్వం సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. కూటమి ప్రజాప్రతినిదుల సిఫారసులతో తిరుపతి అర్బన్ పోస్టింగ్ దాదాపుగా ఖరారైనట్టుగా తెలుస్తోంది. గతంలో రేణిగుంట తహసీల్దారుగా భూముల లావాదేవీల్లో కోట్లాది రూపాయలు వెనకేసుకున్నట్టు ఆరోపణలున్నాయి. శ్రీకాళహస్తి వైసీపీ మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి అనుచరుడిగా వ్యవహరించారన్న ముద్రకూడా ఉంది. వైసీపీ పాలనలో చంద్రబాబును రేణిగుంట విమానాశ్రయంలోట విమానాశ్రయంలో నిర్బంధించేలా సదరు అధికారి వైసీపీ నేతల ఆదేశాలతో ఉత్తర్వులు ఇచ్చారు. టీడీపీ యువనేత లోకేశ్ యువగళం పాదయాత్రలో సదరు అధికారి అక్రమాలను వివరించగా.. కూటమి ప్రభుత్వం రాగానే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ నేపథ్యంలోనే ఏసీబీ ట్రాప్‌లో దొరికి సస్పెండయ్యారు. రివోక్ అయిన అధికారులను నాన్ ఫోకల్ పోస్టులో ఉంచాల్సింది పోయి, ప్రత్యేకమైన తిరుపతి తహసీల్దారుగా కేటాయిస్తే కూటమి ప్రభుత్వం తీవ్ర విమర్శలు ఎదుర్కోక తప్పదు.

సెల్ఫీ పిచ్చితో ప్రాణం పైకి..!

రేణిగుంట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): సెల్ఫీ పిచ్చితో ఓ విద్యార్థి ప్రాణంపైకి తెచ్చుకున్న ఘటన ఆదివారం తిరుపతి జిల్లాలో రేణిగుంట జిల్లా మామండూరులో చోటుచేసుకుంది. ప్రభుత్వ రైల్వే (జీఆర్పీ) ఎస్ఐ రవి తెలిపిన ప్రకారం.. విశాఖకు చెందిన జాన్సన్(19) ఎస్వీయూనివర్శిటీలో బీటెక్ చదువుతున్నాడు. ఆదివారం సెలవు దినం కావడంతో స్నేహితులతో లిసి మామండూరు జలపాతానికి ద్విచక్రవాహనాలపై బయలు దేరారు. మామండూరు రైల్వేస్టేషన్ వద్ద ద్విచక్ర వాహనాలు ఆపారు. అదే సమయంలో రైలు పట్టాలపై ఆగి ఉన్న డీజల్ ట్యాంకుపైకి ఎక్కి. సెల్ఫీ దిగేందుకు జాన్సన్ తన సెల్‌ఫోనును పైకి ఎత్తాడు. అదే సమయంలో 25 వేల వాట్స్ విద్యుత్తు తీగ చేతికి తగలడంతో నిప్పంటుకుని ఎగిరి కిందపడ్డాడు. దీన్ని గమనించిన స్టేషన్‌మాస్టర్.. జీఆర్పీ పోలీసులకు సమాచారం ఇచ్చారు. జాన్సన్‌ను చికిత్స నిమిత్తం రుయాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం జాన్సన్ కోమాలో ఉన్నట్టు వైద్యులు తెలిపారు. ఈ ప్రమాదంపై రైల్వే జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి హత్య



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ గీతాకుమారి

గూడూరు అర్బన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెండో పట్టణ పరిధిలోని వీరారెడ్డిపల్లి ప్రాంతంలో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి హత్యకు గురయ్యాడు. పోలీసుల కథనం మేరకు... వీరారెడ్డిపల్లి సమీపంలోని ఓ లేఅవుట్‌కు వెళ్లే దారి వద్ద మృతదేహం ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. డీఎస్పీ గీతాకుమారి, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ సుబ్రహ్మణ్యంరాజు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతుడు గ్రే రంగు లోయరు ధరించి ఉన్నాడు. కుడిచేతిపై హిందీ భాషలో అశోక్ పేరుతో పచ్చబొట్టు, ఎడమ చేతిపై తేలు బొమ్మ పచ్చబొట్టు ఉంది. 38 ఏళ్ల వయస్సు ఉంటుందని సీఐ శ్రీనివాస్ చెప్పారు. ముఖంపై పదునైన ఆయుధంతో దాడి చేసి హత్య చేసినట్లు తెలుస్తోంది. డాగ్, క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కార్యకర్తలే టీడీపీకి పునాది



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్, నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల తదితరులు

నాయుడుపేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలే టీడీపీకి పునాది అని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్ అన్నారు. నాయుడుపేటలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంతో కలసి మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా టీడీపీ సభ్యత్వ నమోదు కోటికి పైగా జరిగిందన్నారు. కడపలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన మహానాడుకు వేలాది మంది కార్యకర్తలు విచ్చేసి తమ అభిమానాన్ని చాటు కున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శ్రీరాం ప్రసాద్, పెళ్లకూరు మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి పసల గంగాప్రసాద్, తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు అవధానం సుధీర్, పోలేరమ్మ ఆలయ ఛైర్మన్ నానాబాల సుబ్బారావు, శేఖర్‌నాయుడు, జక్క రయ్య, జువ్వలపాటి మస్తాన్, బిరదవాడ నారాయణ, రవి, రామచంద్రారెడ్డి, జీవీఆర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాంధ్ర కార్యక్రమంలో డీఎస్పీ చెంచుబాబు

నాయుడుపేట టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజు యోగా సాధన చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో ఉండవచ్చని డీఎస్పీ చెంచుబాబు అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం ఉదయం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో అనేక ఒత్తిళ్లతో సతమతమవుతున్న ప్రజలు యోగా సాధన చేయడం వల్ల శారీరక దృఢత్వంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో సీఐలు బాబి, సంగమేశ్వరరావు, టీడీపీ నాయకుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త పెనల కిశోర్‌బాబు, న్యాయవాది గంగాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



క్రీడాకారులతో ప్రగతి సేవాసంస్థ సభ్యులు

గూడూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ప్రగతి సేవాసంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం మండలంలోని విందూరు ఉన్నత పాఠశాలలో నెల రోజుల పాటు నిర్వహించిన హాకీ వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. శిక్షణ పూర్తి చేసుకున్న క్రీడాకారులకు టీషర్ట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ క్రీడల వల్ల మానసిక ఉల్లాసం పెరిగి ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో బాలాజీ, వేణు, కరిముల్లాఖాన్, మురళీ నాయుడు, మునిప్రసాద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తిరుమల పవిత్రతను దెబ్బతీస్తే చర్యలు తీసుకోండి

టీటీడీ ఛైర్మన్‌కు టీడీపీ నేతల వినతి



టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, టీడీపీ నేతలు

తిరుపతి, జూన్1(ఆంధ్రజ్యోతి): తిరుమల పవిత్రతను దెబ్బతీసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతలు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడును కోరారు. ఇటీవల తిరుమలలో వైసీపీ నాయకులు శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరిస్తుండాన్ని ఖండిస్తూ డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, టీడీపీ తిరుపతి పార్లమెంటరీ అధికార ప్రతినిధి ఊట్ల సురేంద్ర నాయుడు తదితరులు ఆదివారం టీటీడీ ఛైర్మన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తిరుమలలో ప్రతినిత్యమూ వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని, వీరిమీద కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బీఆర్ నాయుడు స్పందిస్తూ ప్రభుత్వంతో చర్చించి కొత్త చట్టం తీసుకొస్తామని హామీ ఇచ్చారు.

లారీ ఢీకొని కార్మికుడి మృతి



చిరంజీవి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

నాయుడుపేట టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - మేనకూరు సెజ్ సమీపంలో లారీ ఢీకొని కార్మికుడు చిరంజీవి(21) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... ఓజిలి మండలం గ్రద్దగుంట గ్రామానికి చెందిన చిరంజీవి మేనకూరు సెజ్‌లోని ఓ కర్మాగారంలో పని చేస్తున్నాడు. ఆదివారం ఉదయం విధులకు హాజరయ్యేందుకు ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా సెజ్ సమీపంలో ముందు వెళ్తున్న కంటైనర్ లారీ అకస్మాత్తుగా మలుపు తిరగడంతో ప్రమాదం చోటు చేసుకుంది. దీంతో చిరంజీవి అక్కడిక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

ముత్యాలమ్మకు పూజలు

చిల్లకూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి నైవేద్యం నివేదించి ముత్యాలమ్మను దర్శించుకున్నారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

రేషన్ వ్యవస్థను పటిష్ఠ పరిచేందుకు చర్యలు



గూడూరులో బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రేషన్ పంపిణీ వ్యవస్థను పటిష్ఠ పరిచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, ఇందులో భాగంగానే దుకాణాల ద్వారానే సరుకులు అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం గూడూరు పట్టణంలోని రాణిపేట, కోనేటిమిట్ట ప్రాంతాల్లోని రేషన్ దుకాణాల్లో లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం పేదలకు బియ్యం సక్రమంగా పంపిణీ చేయకుండా అక్రమంగా అమ్ముకుందన్నారు. రేషన్ పంపిణీ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం పాత పద్ధతిలోనే దుకాణాల ద్వారా సరుకులు అందించే కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. 65 ఏళ్లు నిండిన వృద్ధులకు, దివ్యాంగులకు ఇంటి వద్దే రేషన్ అందించడం జరుగుతుందన్నారు.

ఓజిలి: మండలంలోని పున్నేపల్లి రేషన్‌షాపులో టీడీపీ మండల కన్వీనరు గుజ్జలపూడి విజయకుమార్ నాయుడు బియ్యం పంపిణీ చేశారు. కురుగొండ్ల రేషను షాపులో తహసీల్దారు పద్మావతి లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేశారు. ఓజిలి, మానమాల, రాచపాళెం గ్రామాల్లో టీడీపీ బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, ఓజిలి క్లస్టర్ ఇన్‌చార్జి కంకణాల సత్యవరప్రసాద్‌రావు, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, తెలుగు మహిళ పవిత్రారెడ్డి, మైనారిటీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే ఖలీల్, నాయకులు అర్జున్‌రాజు బియ్యం పంపిణీ చేశారు.

పెళ్లకూరు: మండలంలోని తాళ్వాయిపాడుచౌక దుకాణంల్లో సివిల్ సప్లై డీటీ గోపీనాథ్‌రెడ్డి, తహసీల్దార్ ద్వారకనాథ్‌రెడ్డి టీడీపీ నాయకులతో కలసి రేషన్ బియ్యం పంపిణీ చేశారు. మండల కేంద్రమైన పెళ్లకూరులో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, నాయకులు పేరం రమేష్ నాయుడు, దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, శిరసనంబేటి చైతన్య కృష్ణారెడ్డి, కలవకోలు మునీష్ బియ్యం పంపిణీ చేశారు. రావులపాడులో టీడీపీ నేత కొచ్చర్ల వెంకటరమణ నాయుడు బియ్యం పంపిణీ చేశారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని ఎస్ఎస్ఆర్ కాలనీలో ఉన్న రేషన్ దుకాణంలో తహసీల్దారు రాజేంద్ర, సివిల్ సప్లయ్ డీటీ గోపీనాథ్‌రెడ్డి సరుకుల పంపిణీని ప్రారంభించారు.

తడ: మాంబట్టు రేషన్ దుకాణంలో తహసీల్దారు శరత్‌బాబు, గ్రద్దగుంటలో టీడీపీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి మురళీరెడ్డి, బీజేపీ అధ్యక్షుడు తేజారెడ్డి, కాదలూరులో టీడీపీ నాయకుడు వేలూరు చంద్రయ్య, కారూరులో టీడీపీ మండల కార్యదర్శి నీలకంఠం రేషన్ పంపిణీ చేశారు.

చిల్లకూరు: మండల కేంద్రంలోని రేషన్ షాపుల్లో లబ్ధిదారులకు తహసీల్దారు శ్రీనివాసులు, టీడీపీ నాయకుడు చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి బియ్యం పంపిణీ చేశారు.

డక్కిలి: పలుగోడు గ్రామంలోని రేషన్ షాపులో తహసీల్దార్ శ్రీనివాసులు, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి బియ్యం పంపిణీ చేశారు. రంగినేని రాజా తదితరులు పాల్గొన్నారు.

కోట: మండలంలోని తిన్నెలపూడి, చెందోడు, కేశవరం, చిట్టేడు రేషన్ షాపుల్లో తహసీల్దారు జయజయరావు బియ్యం పంపిణీ చేశారు. కోటలోని రేషన్ షాపులో టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్, ఎంపీటీసీ దారా సురేష్, పంషుద్దీన్ బియ్యం పంపిణీ చేశారు.

వాకాడు: కొండూరులో టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, వాకాడు, నెలిపూడిలో టీడీపీ నాయకులు సన్నారెడ్డి విజయశేఖర్‌రెడ్డి, బాలిరెడ్డిపాళెంలో వెంకటరమణారెడ్డి, రావిగుంటపాళెంలో దువ్వూరు అజిత్‌కుమార్‌రెడ్డి, దుగరాజపట్నంలో దోశకాయల కృష్ణమూర్తి, తిరుమూరులో కుంచం దయాకర్ బియ్యం పంపిణీ చేశారు.

వెంకటగిరి టౌన్: మండల పరిధిలోని జంగాలపల్లిలో రేషన్ షాపులో తహసీల్దార్ రాంబాబు బియ్యం పంపిణీ చేశారు.

రేషన్ సరుకుల కోసం పది కిలోమీటర్లు వెళ్లాలా?

కోతలగుంట గ్రామస్తుల నిరసన



నిరసన తెలుపుతున్న కోతలగుంట గ్రామస్తులు

చిట్టమూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): పది కిలోమీటర్ల దూరంలో ఉన్న రేషన్ షాపుకెళ్లి సరుకులు తెచ్చుకోలేమని కోతలగుంట గ్రామస్తులు ఆదివారం గ్రామంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలోని ఈశ్వరవాక పంచాయతీలో ఉన్న కోతలగుంట నుంచి ఈశ్వరవాక గ్రామంలో రేషను షాపునకు వెళ్లాలంటే రోడ్డు మార్గంలో పది కిలోమీటర్లు ప్రయాణించాలన్నారు. పొలాల మీదుగా వెళ్లాలన్నా రెండు కిలోమీటర్లు దూరం వెళ్లాలని, రైతులు వరి సాగుకు సిద్ధం చేయడంతో పొలాల మీదుగా వెళ్లలేమన్నారు. కోతలగుంటలో 180 రేషన్ కార్డులున్నాయని, వీరందరికీ గ్రామంలోనే సరుకులు ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

ఐదుగురు హెచ్‌ఎంల నియామకం

కోట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడలి, పెదగోవిందపల్లి, నెల్లూరుపల్లి కొత్తపాళెం, కోటలోని జిల్లా పరిషత్ బాలికలు, బాలురు ఉన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు ఆదివారం బాధ్యతలు తీసుకున్నారు. అలాగే ఊనుగుంటపాళెం, చెందోడు, ఉత్తమ నెల్లూరు ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ కావడంతో రెండు రోజుల్లో కొత్త హెచ్‌ఎంల నియామకం జరుగుతుందని ఎంఈవో మస్తానయ్య తెలిపారు.

పోక్సో కేసునమోదు

చిల్లకూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన యువకుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు.

వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయండి

గూడూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీన నిర్వహించనున్న వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా పూర్తిస్థాయిలో పథకా లను అమలు పరచలేదన్నారు. స్థానిక టవర్ క్లాక్ కేంద్రం నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన చేపట్టనున్నట్లు తెలిపారు.

బీజేపీ బలోపేతానికి కలిసికట్టుగా కృషి



సమావేశంలో కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామితో బీజేపీ నాయకులు

గూడూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): బీజేపీ బలోపేతానికి అందరం కలిసికట్టుగా పనిచేద్దామని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి అన్నారు. ఆదివారం చెన్నూరు గ్రామంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో బీజేపీ కిసాన్ మోర్చా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్ర స్థావరాలపై దాడులు నిర్వహించి మన దేశ శక్తిని ప్రధాని ప్రపంచానికి చాటి చెప్పారన్నారు. కార్యక్రమంలో గాలి ప్రకాష్ నాయుడు, కరుణాకర్‌రెడ్డి, నన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, సురేంద్రనాథ్‌రెడ్డి, సామంచి శ్రీనివాస్, భారతి మోహన్, దయాకర్‌రెడ్డి, చంద్రప్ప, రవిచంద్రారెడ్డి, అభిలాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 15 గంటలు

తిరుమల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూ కాంప్లెక్స్ 2లోని 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరి ప్యార్‌లో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయారు. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. శుక్రవారం హుండీ ఆదాయం రూ.3.47 కోట్లు లభించింది. శనివారం 95,080 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు.

గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ



యాగశాలలో పూజలు

తిరుపతి అర్బన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): గోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆదివారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించారు. ఉదయం సుప్రభాతం, తోమాల, అర్చన, సహస్రనామార్చన, ఆలయ ప్రాంగణంలో సేనాధిపతి ఉత్సవం, ముఖమండపంలో వేంచేపు, సమర్పణ, ఆస్థానం ఇత్యాది పూజా కార్యక్రమాలు చేశారు. టీటీడీ జియ్యంగార్లు, అధికారులు, అర్చకస్వాములు పాల్గొన్నారు. సోమవారం ఉదయం 7.20గంటలకు మిథున లగ్నంలో ధ్వజారోహణం, రాత్రి 7 గంటలకు పెద్దశేష వాహనం ఉంటాయి.

ఉచిత వైద్యశిబిరం

గూడూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): స్థానిక రెండో పట్టణ పరిధిలోని వీఎస్ఆర్ పాఠశాలలో ఆదివారం స్ఫూర్తి సేవాసమితి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో చదలవాడ హరిప్రసాద్, శీలం కిరణ్ కుమార్, బాలకృష్ణంరాజు, భానుశ్రీ, వెంకటేశ్వర్లురాజు, ఆరికట్ల మస్తాన్‌నాయుడు, అబ్దుల్ రహీం, యోగి, ముమ్మడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

కోట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నెల్లూరుపల్లి కొత్తపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 2001-2002 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు కలుసుకుని ఉల్లాసంగా గడిపారు. అప్పటి గురువులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలతో అభినందించారు. వారికి పాదాభివందనం చేసి ఆశీర్వాదం పొందారు.

తెలుగుగంగ నీటి విడుదలపై వివాదం

సూళ్లూరుపేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తెలుగుగంగ నీటి విడుదలపై వివాదం చోటుచేసుకుంది. కాళంగి నదిలోకి వచ్చిన గంగ నీరు నెర్రికాలువలోకి చేరుతుంది. నెర్రికాలువ గుండా కోటపోలూరు, సామంతమల్లాం, ఆబాక, గోపాల్‌రెడ్డిపాలెం తదితర గ్రామాలకు జాతీయ రహదారి పక్కనే ఎన్‌వీకండ్రిగ సమీపంలో ఉన్న గేట్లు ఎత్తి నీటిని విడుదల చేసే విషయంలో ఆయా గ్రామాల్లోని అధికార పార్టీ నాయకుల నడుమ వివాదం తలెత్తింది. తమ గ్రామానికే నీరు మొదట రావాలని కోటపోలూరుకు చెందిన గ్రామస్తులు, తొలుత తమకే రావాలని ఆబాక, సామంతమల్లాం రైతులు పోటాపోటీగా గేట్లను మూసివేశారు. దీంతో ఒక వర్గానికి చెందిన వారు ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న అధికార పార్టీ నాయకులు కొందరు పోలీస్ స్టేషన్‌కు చేరుకొని ఇరువర్గాలను రాజీ కుదిర్చే పనిలో ఉన్నట్లు సమాచారం.

ప్రైవేటు ట్రావెల్స్‌పై రవాణా శాఖ కొరడా

25 బస్సులపై కేసుల నమోదు

రూ.10 లక్షల అపరాధ రుసుం వసూలు

తిరుపతి(జీవకోన), జూన్ 1(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై రవాణా శాఖ కొరడా ఝుళిపించింది. తిరుపతి నుంచి హైదరాబాద్, బెంగళూరు, విశాఖపట్నం ఇతర దూర ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై శనివారం అర్ధరాత్రి జిల్లా రవాణాశాఖ అధికారి మురళీమోహన్ పర్యవేక్షణలో అధికారులు దాడులు నిర్వహించారు. ఫిట్‌నెస్ లోపం, పన్నులు చెల్లించని, ఇతర అనుమతులు లేని కారణంగా 25 బస్సులపై కేసులు నమోదు చేశారు. రూ.10లక్షల వరకు అపరాధ రుసుం వసూలు చేశారు. నేషనల్ పర్మిట్ ఉన్న బస్సులకు ఇరువురు డ్రైవర్లు విధుల్లో ఉండేలా చూశారు. బస్సుల సామర్థ్యాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ధ్రువపత్రాలు లేని బస్సులను స్వాధీనం చేసుకున్నారు. ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. వారం రోజులుగా ప్రైవేటు ట్రావెల్స్‌పై పలు రకాల కేసులు నమోదు చేయడమే కాకుండా మూడు బస్సులను స్వాధీనం చేసుకున్నట్లు ఆర్టీవో మురళీమోహన్ తెలిపారు. ఈ తనిఖీల్లో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు వెంకటసుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, అతికానాజ్, చంద్రశేఖర్ ఉన్నారు. సూళ్లూరుపేట, గూడూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు సునీల్‌రెడ్డి, ప్రభాకర్, శాంతి, అనిల్‌కుమార్ ఆయా ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు.



దాడులు నిర్వహిస్తున్న రవాణాశాఖ అధికారి శ్రీనివాసరావు

మాతమ్మకు పొంగళ్లు



మాతమ్మ ఆలయం వద్ద పొంగళ్లు పొంగిస్తున్న భక్తులు

చిల్లకూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చిల్లకూరు అరుంధతీయవాడలోని మాతమ్మకు ఆదివారం నెల పొంగళ్లు పెట్టారు. గత నెల 7నుంచి 11వ తేదీ వరకు మాతమ్మ కొలుపు ఉత్సవాలు నిర్వహించారు. ఆదివారం ఉదయం అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. మధ్యాహ్నం అమ్మవారి ముగ్గు వేశారు. సాయంత్ర ఆలయం వద్ద భక్తులు సామూహికంగా పొంగళ్లు పొంగించి నైవేద్యం నివేదించారు. రాత్రి తప్పెట్లు, తాళాలు, బాణసంచా పేలుళ్ల నడుమ అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు.

అట్రాసిటీ కేసు విచారణ

వెంకటగిరి టౌన్, జూన్ 1: అట్రాసిటీ కేసు విచారణ నిమిత్తం గూడూరు డీఎస్పీ గీతాకుమారి ఆదివారం వెంకటగిరి మండల పరిధిలోని వర్ధనపల్లిని సందర్శించారు. వర్ధనపల్లి గ్రామానికి చెందిన మూకల చెంచయ్యతో బాలాయపల్లి మండలం అక్కంపేట గ్రామానికి కొంతమందితో భూ వివాదం ఉండేది. ఇటీవల అక్కంపేటవాసులు చెంచయ్య భూమిలో శవాన్ని పూడ్చిపెట్టారు. చెంచయ్య ఫిర్యాదు మేరకు అక్కంపేట గ్రామస్తులపై వెంకటగిరి పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేశారు. దీంతో గీతాకుమారి విచారణ చేపట్టారు. ఆమె వెంట ఎస్ఐ సుబ్బారావు, సిబ్బంది ఉన్నారు.

పాలస్తీనా ముఖ చిత్రం పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రైతు కూలీ సంఘం నాయకులు

వెంకటగిరి టౌన్, జూన్ 1: స్థానిక ఆర్వీఎం ఉన్నత పాఠశాలలో పాలస్తీనా ముఖ చిత్రం పుస్తకావిష్కరణ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమణయ్య మాట్లాడుతూ 600 రోజులుగా గాజాపై జరుగుతున్న దాడిలో 50మందికి పైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయారన్నారు. గాజాలో ఏం జరుగుతోందో ప్రజలకు తెలియజేయడానికి ఈ పుస్తకాన్ని ప్రచురించామని తెలిపారు. పాలస్తీనా యుద్ధం వెనుక ఆయుధ వ్యాపారం, ఆర్థిక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో అజిత, గౌస్‌భాషా, లక్ష్మీరెడ్డి, పవన్, కృష్ణారెడ్డి, తిరుపాలు, చిన్న ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

తిరుమల పవిత్రతకు భగం వాటిల్లితే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ సభ్యులు శాంతారాం, నరేష్

తిరుపతి(ఆటోనగర్), జూన్1(ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తుల మనోభావాలు దెబ్బతీసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని టీటీడీ పాలక మండలి సభ్యులు వైద్యం శాంతారాం, నరేష్ హెచ్చరించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం వారు మాట్లాడుతూ క్యూలైన్‌లో భక్తులకు వేడిపాలు సరఫరా చేయలేదని వైసీపీ నాయకులు ఛైర్మన్, ఈవో డౌన్‌డౌన్ అని నినాదాలు చేయడం సరికాదన్నారు. పాలు సరఫరాలో జాప్యం జరిగితే అధికారులను ప్రశ్నించాలే తప్పా ఉద్దేశపూర్వకంగా పాలకమండలిని నిందించడం బాధాకరమన్నారు. వైసీపీ నేతలు ఉద్దేశపూర్వకంగా భక్తుల మనోభావాలను దెబ్బతీసేవిధంగా కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. వైసీపీ హయాంలో టీటీడీలో వేలకోట్ల రూపాయల అవినీతి జరిగిందని, ప్రస్తుతం దానికి ఫుల్‌స్టాప్ పెట్టామని పేర్కొన్నారు. తిరుమల పవిత్రతకు భగం వాటిల్లే విధంగా సోషల్ మీడియాలో ఆరోపణలు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఆటోడ్రైవర్ ఆత్మహత్య

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): జీవకోనలో ఆదివారం ఆటోడ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు. అలిపిరి ఎస్ఐ లోకేష్‌బాబు వివరాల మేరకు.. రామేశ్వరరెడ్డి, మహిత దంపతులు జీవకోనలో కాపురముంటున్నారు. రామేశ్వర రెడ్డి ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొన్ని రోజులుగా మద్యానికి బానిస య్యాడు. డబ్బు కోసం తరచూ భార్యతో గొడవపడేవాడు. శనివారం అర్ధరాత్రి తాగొచ్చి భార్యతో గొడవపడుతుండగా ఆమె తండ్రి అడ్డుప డ్డాడు. రామేశ్వరరెడ్డిని బయటకు తోసేసి తలుపులు వేసుకున్నారు. తలుపులు తీయమని కోరినా తీయకపోవడంతో ఆవేశానికి గురై బయట ఉన్న రాడ్‌కు చీరతో ఉరేసుకున్నాడు. కొంతసేపటికి బయ టకు వచ్చిన మహిత భర్త మృతి చెంది ఉండడం గమనించి అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ లోకేష్‌బాబు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాకు తరలించారు.